


Truth of News
PRGI Reg No: APTEL/26/A4781
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్: మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 03 | సంచిక : 26 | శుక్రవారం 04 సెప్టెంబర్ 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi



## భారతదేశ ఆర్థిక వృద్ధి ప్రపంచానికి విశ్వాసాన్ని ఇస్తోంది

- ప్రధాని నరేంద్ర మోడీ

బెల్జియం– సూర్య వాస్తవం:

గురువారం భారత ప్రధాని నరేంద్ర మోదీ, బెల్జియం ప్రధాని బార్ట్ డి వెవర్‌ల మధ్య జరిగిన చర్చల అనంతరం, వాణిజ్యం, రక్షణ, కీలక ... ఇంధనం, సాంకేతిక రంగాలలో సహకారాన్ని విస్తరించుకోవడానికి భారత్, బెల్జియం దేశాలు అంగీకరించాయి. చర్చల అనంతరం విడుదల చేసిన తన మీడియా ప్రకటనలో, గత త్రైమాసికంలో భారతదేశం సాధించిన 7.8 శాతం ఆర్థిక వృద్ధిని మోదీ ప్రముఖంగా ప్రస్తావిస్తూ, దేశం యొక్క ఈ ఎదుగుదల ప్రపంచానికి ఆత్మవిశ్వాసానికి, కొత్త అవకాశాలకు మూలమని అభివర్ణించారు. భారత్–యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదరడాన్ని బెల్జియం ప్రధానమంత్రి ఒక ప్రధాన మైలురాయిగా అభివర్ణించారు. అలాగే, న్యూఢిల్లీ, బ్రస్సెల్స్ గతంలో ఎన్నడూ లేని విధంగా

- మిగతా 2లో..

# ఆహార భద్రతకు వాతావరణ ముప్పు

- రికార్డు స్థాయి ఆహార ధాన్యాల ఉత్పత్తి అంటూ కేంద్రం ప్రచారం..
- దేశంలో వాతావరణ సంక్షోభంపై మాత్రం నిర్లక్ష్యం..
- బియ్యం, గోధుమలకే మోడీ సర్కారు చర్యలు పరిమితం
- నీటి కొరత, కరువు, వరదలకు అనుగుణంగా మారని విధానాలు..'ఫుడ్ సెక్యూరిటీ' కాదు..
- 'క్లైమేట్ సెక్యూరిటీ' అవసరం
- రైతు భవిష్యత్‌ను కాపాడాలంటే అదే కీలకం..
- ప్రభుత్వానికి వ్యవసాయ నిపుణులు, విశ్లేషకుల సూచనలు



న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

దేశంలో ఆహార ధాన్యాల ఉత్పత్తి రికార్డు స్థాయికి చేరిందని మోడీ ప్రభుత్వం పదేపదే ప్రచారం చేసుకుంటున్నా.. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా దేశ ఆహార వ్యవస్థను మార్చడంలో మాత్రం ఇంకా ప్రశ్నార్థకంగానే ఉంది. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, అస్తవ్యస్త వర్షాలు, కరువులు, ఆకస్మిక వరదలు, భూగర్భజలాల క్షీణత ఇప్పటికే వ్యవసాయానికి తీవ్ర ముప్పుగా మారుతున్నాయి. ఇలాంటి సమయంలో కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పాతకాలపు బియ్యం, గోధుమల ఆధారిత విధానాన్ని కొనసాగించడం, పంటల వైవిధ్యానికి తగిన ప్రోత్సాహం ఇవ్వకపోవడం భవిష్యత్ ఆహార భద్రతను ప్రమాదంలోకి నెట్టే అవకాశం ఉందని వ్యవసాయ నిపుణులు, పరిశోధకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 1960లలో విదేశీ ఆహార సాయంపై ఆధారపడిన దేశం.. నేడు 350 మిలియన్ టన్నులకు పైగా ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేసే స్థాయికి చేరింది. కానీ ఆ ఘనతను కాపాడేందుకు అవసరమైన తదుపరి దశలో కేంద్రం ఎంత వరకు ముందుకు వెళ్తోందన్నదే అసలు ప్రశ్నగా మిగిలింది.

చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, నూనెగింజలు వంటి పంటలకు ప్రాధాన్యం పెంచడం

- మిగతా 2లో..



## లా విద్యార్థులను బీసీఐ నియంత్రించలేదు

- నల్సార్ విద్యార్థులపై బీసీఐ జారీ చేసిన ఉత్తర్వులను కొట్టివేసిన సుప్రీంకోర్టు
- అడ్వకేట్‌గా నమోదైన తర్వాతే వాటి పరిధిలోకి
- లా విద్యార్థులపై క్రమశిక్షణ చర్యలు ఆయా విద్యాసంస్థలే తీసుకోగలవు
- నల్సార్ విద్యార్థులపై బీసీఐ జారీ చేసిన ఉత్తర్వులకు చట్టబద్ధత లేదు: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం

లా విద్యార్థుల ప్రవర్తనను నియంత్రించే అధికారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ)కు గానీ, రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకుగానీ లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆ విద్యార్థులు చదువుతున్న విశ్వవిద్యాలయాలు, విద్యాసంస్థలకు మాత్రమే ఆ అధికారం ఉంటుందని తేల్చి చెప్పింది నల్సార్ లా యూనివర్సిటీ స్నాతకోత్సవానికి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించవద్దంటూ ఆ వర్సిటీ విద్యార్థులు వీసీకి లేఖ రాయటం, ఈ నేపథ్యంలో నల్సార్ 2026 బ్యాచ్ విద్యార్థులను న్యాయవాదులుగా నమోదు చేసుకోవద్దంటూ బీసీఐ చెయిర్ పర్సన్ మనన్‌కుమార్‌మిశ్రా బార్ కౌన్సిళ్లకు ఉత్తర్వులు

- మిగతా 2లో..

# ఎల్‌నినో తీవ్రం!

- 30 ఏళ్లలో ఎన్నడూ లేనంత తక్కువ వానలు
- 52శాతం లోటు వర్షపాతం నమోదు
- అయినా తాగునీటికి ఇబ్బందులు రాకూడదు
- తర్వాతి ప్రాధాన్యం పశువులు, పశుగ్రాసానికి వేసిన పంటలకు నీటి కొరత రాకూడదు
- ఒక్క ఎకరా ఎండకూడదు.. జీఎస్‌డీపీ తగ్గకూడదు
- ఎప్పటికప్పుడు పరిస్థితిని కేంద్రానికి నివేదిద్దాం
- వీలైనంత ఎక్కువ విపత్తు నిధులు సాధిద్దాం
- కరువు పరిస్థితుల్లోనూ గొడ్డలి పార్టీ రాజకీయం
- ప్రాజెక్టుల్లో నీళ్లున్నా పంటలకు ఇవ్వడం లేదని తప్పుడు ప్రచారం.. మంత్రులు తిప్పికొట్టాలి
- నిత్యావసర ధరలపై నిరంతర సమీక్ష
- క్యాబినెట్ భేటీలో సీఎం చంద్రబాబు నిర్దేశం



అమరావతి– సూర్య వాస్తవం

రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొని ఉన్నాయని, గడచిన 30 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా అతి తక్కువ వర్షపాతం నమోదైందని సీఎం చంద్రబాబు తెలిపారు. అన్నమయ్య జిల్లాలో అతి తక్కువగా 76 శాతం, ప్రకాశం జిల్లాలో 70 శాతం మేర లోటు వర్షపాతం నమోదైందన్నారు. దేశంలో లోటు వర్షపాతం 14 శాతంగా ఉంటే రాష్ట్రవ్యాప్తంగా సగటున 52 శాతం లోటు వర్షపాతం నమోదైందని, ఈ పరిస్థితుల్లో అన్ని శాఖలూ ఎల్‌నినోను సమర్థంగా ఎదుర్కోవడంపై దృష్టి సారించాలని కోరారు. తాగునీటికి ప్రథమ ప్రాధాన్యమిచ్చి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు

- మిగతా 2లో..

# కొబ్బరికాయ కొట్టి చేతులు దులుపుకున్నారు

- గత పాలకుల మోసాలను ఎత్తిచూపుతూ సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం
- చంచల్‌గూడ - సంతోష్‌నగర్ స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవంలో
- గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- బ్రిడ్జి నిర్మాణానికి ఒక్క పైసా ఖర్చు చేయకుండా కేవలం ప్రచారం చేసుకున్నారని మండిపాటు
- ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ప్రత్యేక నిధులతో పనులు పూర్తి చేసి ప్రజలకు అంకితం చేశామని స్పష్టీకరణ



హైదరాబాద్ – సూర్య వాస్తవం: గత పాలకులు కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమై, అభివృద్ధిని పూర్తిగా గాలి కొదిలేశారని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నల్గొండ క్రాస్ రోడ్డు వద్ద చంచల్‌గూడ – సంతోష్‌నగర్ మధ్య నూతనంగా నిర్మించిన స్టీల్ ఫ్లైఓవర్‌ను గురువారం ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి గత పాలకుల నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపుతూ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఈ ఫ్లైఓవర్ నిర్మాణానికి కేవలం కొబ్బరికాయ కొట్టి చేతులు దులుపుకున్నారే తప్ప, ఆచరణలో బ్రిడ్జి నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని విమర్శించారు. కేవలం ఎన్నికల స్టంట్ల కోసం శంకుస్థాపనలు చేయడం, ఆ తర్వాత పనులను గాలికొదిలేయడం గత పాలకుల

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## చెన్నైలో 'ఒలింపిక్ సిటీ'.. ఫార్ములా-1 ట్రాక్.!

ఇంటర్నెట్ డెస్క్ – సూర్య వాస్తవం:

తమిళనాడు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. చెన్నై నగరాన్ని ఇంటర్నేషనల్ స్పోర్ట్స్ సెంటర్‌గా తీర్చిదిద్దే దిశగా ముందడుగు వేసింది. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలోని 110వ నిబంధన కింద ఒలింపిక్ సిటీని ఏర్పాటు చేయనున్నట్టు సీఎం జోసెఫ్ విజయ్ ప్రకటించారు. రాష్ట్ర క్రీడా అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్మించనున్న ఈ ప్రాజెక్టులో ప్రపంచ స్థాయి క్రీడా వేదికలు, ఆధునిక శిక్షణ పరికరాలు,

- మిగతా 2లో..



## డీజీపీ చాలా తేలిగ్గా తీసుకుంటున్నారు

- ఆయన చర్యల పట్ల మేం సంతృప్తిగా లేం
- సిట్ ఏర్పాటు కంటి తుడుపు చర్య: హైకోర్టు
- ఎస్‌జీపీ అభ్యర్థనతో విచారణ 7కి వాయిదా

అమరావతి– సూర్య వాస్తవం

పదో తరగతి చదువుతున్న బాలిక అదృశ్యం కేసులో డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా వైఖరిని హైకోర్టు తీవ్రంగా తప్పుపట్టింది. బాలిక ఆచూకీ తెలియకుంటే

- మిగతా 2లో..



# చెన్నైలో 'ఒలింపిక్ సిటీ'..
# ఫార్ములా-1 ట్రాక్.!

(మొదటి పేజీ తరువాయి)

హై పర్ఫార్మెన్స్ ట్రైనింగ్ సెంటర్, స్పోర్ట్స్ సైన్స్, స్పోర్ట్స్ మెడిసిన్ కేంద్రాలు వంటివాటిని నిర్మించనున్నట్టు పేర్కొన్నారు. అంతేకాకుండా క్రీడాకారులు, కోచ్‌ల కోసం వసతి సదుపాయాలతో కూడిన సమగ్ర క్రీడా కేంద్రంగానూ చెన్నైని అభివృద్ధి చేయనున్నట్టు తెలుస్తోంది. దేశంలోకి ఫార్ములా వన్ రేసింగ్‌ను తిరిగి తీసుకురావడం సహా అంతర్జాతీయ పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించేలా అత్యుత్తమ శిక్షణ, సహాయక సదుపాయాలు కల్పించడమే ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యమని ప్రభుత్వం స్పష్టం చేసింది. '2028 నాటికి భారత్‌లోకి ఎఫ్-1ను తిరిగి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తాం. ఇందుకోసం దేశంలో మోటార్ స్పోర్ట్స్‌ను పర్యవేక్షించి, మంత్రిత్వ శాఖకు నివేదిక సమర్పించేందుకు ఓ టాస్క్ ఫోర్స్‌ను ఏర్పాటుచేశాం' అని యువజన, క్రీడా మంత్రిత్వ శాఖ తెలిపింది. అదే సమయంలో చెన్నైలో ప్రత్యేకంగా మోటార్ స్పోర్ట్స్ సిటీని ఏర్పాటు చేసి ఫార్ములా-1 నుంచి ఎఫ్-4 వరకు రేసులు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. భారత్‌లో 2030 నాటికి ఫార్ములా-1 రేస్, 2028 నాటికి వరల్డ్ ర్యాలీ ఛాంపియన్‌షిప్‌లో ఒక రౌండ్ సహా మోటోజీపీని నిర్వహించే దిశగా కేంద్రం చర్యలు చేపట్టినట్టు ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎమ్ఎస్‌సీఐ) ప్రెసిడెంట్ అరిందమ్ ఘోష్ ఇదివరకే వెల్లడించిన సంగతి తెలిసిందే.

# లా విద్యార్థులను బీసీఐ నియంత్రించలేదు

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేసిన విషయం తెలిసిందే. కాగా, ఈ ఉత్తర్వుల మీద తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావటంతో వాటిని కొద్దిసేపట్లోనే బీసీఐ ఉపసంహరించుకుంది. ఈ వ్యవహారంపై విచారణ జరిపించాలని కోరుతూ నల్సార్ పూర్వ విద్యార్థులు కొందరు సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ వీ మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం గురువారం విచారణ జరిపింది. న్యాయవాదుల చట్టం, 1961కింద బీసీఐ ఏర్పాటైన విషయాన్ని గుర్తు చేస్తూ, లా విద్యార్థుల మీద ఎలాంటి క్రమశిక్షణ చర్యలైనా తీసుకునే అధికారం ఈ చట్టం కింద బీసీఐకిగానీ, రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకుగానీ లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. లా విద్యార్థులు డిగ్రీ పూర్తి చేసి, అడ్వకేట్లుగా నమోదు చేసుకున్న తర్వాతే వారి మీద బీసీఐకి, బార్ కౌన్సిళ్లకు నియంత్రణాధికారం ఉంటుందని తెలిపింది. లా విద్యార్థులకు సంబంధించి ఏమైనా క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటే.. ఆ అధికారం వారు చదువుతున్న విద్యాసంస్థకు మాత్రమే, అది కూడా ఆ సంస్థ నియమ నిబంధనలకు లోబడి ఉంటుందని పేర్కొంది.

తద్వారా ఆగస్టు 13వ తేదీన బీసీఐ జారీ చేసిన ఉత్తర్వులు, ఆ తర్వాత మళ్లీ వెలువరించిన సవరించిన ఉత్తర్వులకు ఎటువంటి చట్టబద్ధత లేదని ప్రకటించింది. వాటిని రద్దు చేస్తున్నట్లు తెలిపింది. విద్యార్థులకు భావవ్యక్తీకరణ స్వేచ్ఛ ఉన్నప్పటికీ, అది హద్దులు దాటకూడదని హితవు పలికింది. కాగా, విచారణ సందర్భంగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది కే పరమేశ్వర్ వాదనలు వినిపిస్తూ.. ఉత్తర్వులను బీసీఐ ఉపసంహరించుకున్నప్పటికీ, ఆ సంస్థ వ్యవహరించిన తీరుపై విచారణ జరిపించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీఐ తరఫున చెయిర్ పర్సన్ మనన్‌కుమార్ మిశ్రా వాదనలు వినిపించారు. ఇది ముగిసిపోయిన వ్యవహారమని, ఉత్తర్వులను వెలువరించిన వెంటనే వాటిని ఉపసంహరించుకున్నామని తెలిపారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం తీర్పును వెలువరిస్తూ, కేసును ముగిస్తున్నట్లు తెలిపింది.

**నేనూ ఉద్యమాల్లో పాల్గొన్నా**

విచారణ సందర్భంగా జస్టిస్ సూర్యకాంత్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'విద్యార్థులు అడ్వకేట్లుగా నమోదు చేసుకున్న తర్వాతే వారిపై బీసీఐకి నియంత్రణ ఉంటుంది. అంతవరకు విద్యా ప్రమాణాలను నిర్దేశించడానికే బీసీఐ పరిమితం కావాలి తప్ప, విద్యార్థులపై నేరుగా క్రమశిక్షణ చర్యలు తీసుకోలేదు. నా విద్యార్థి దశలో నేనూ చురుగ్గా విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నా. విద్యార్థుల అభిప్రాయం తప్పైనా సరే, నిరసన తెలిపే హక్కు వారికి ఉంటుంది' అని పేర్కొన్నారు. ఇదివరకు ఈ అంశం ధర్మాసనం ఎదుట ప్రస్తావనకు వచ్చినప్పుడు కూడా.. 'ఇది నాకూ విద్యార్థులకు మధ్య జరిగే సంభాషణ. దీంట్లో జోక్యం చేసుకోవడానికి బీసీఐ ఎవరు అని సీజేఐ వ్యాఖ్యానించారు.

# డీజీపీ చాలా తేలిగ్గా తీసుకుంటున్నారు

(మొదటి పేజీ తరువాయి)

కోర్టు ముందుకు వచ్చి మరింత సమయం కోరాలని, అంతేతప్ప సిట్ ఏర్పాటు చేయడం ఏంటని ప్రశ్నించింది. బాలికను కోర్టు ముందు హాజరుపర్చాలని మాత్రమే ఆదేశాలిచ్చామని గుర్తు చేసింది. డీజీపీ మైండ్ అప్లై చేసినట్లు కనిపించడం లేదని పేర్కొంది. హెబియస్ కార్పస్ పిటిషన్‌లో కోర్టు ఆదేశాలు అమలు చేసేది ఇలాగేనా అని నిలదీసింది. సిట్ ఏర్పాటు చేయడమంటే కేసును కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టడమేనని పేర్కొంది. డీజీపీయే స్వయంగా రంగంలోకి దిగి సిబ్బందిని పరుగులు పెట్టిస్తే బాలిక ఆచూకీ ఇట్టే తెలుస్తుందని వ్యాఖ్యానించింది. 75, 76 ఏళ్ల వయసులో కూడా దేశ ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు దేశ, రాష్ట్రాభివృద్ధి కోసం కష్టపడుతుంటే... అదృశ్యమైన బాలిక విషయంలో డీజీపీ ఇలాగేనా స్పందించేది అని ప్రశ్నించింది. ఆయన నుంచి ఈ తరహా స్పందన ఆశించలేదని పేర్కొంది.

ఇలాంటి అధికారుల వల్లే ప్రభుత్వాలకు చెడ్డపేరు వస్తుందని తెలిపింది. సిట్ ఏర్పాటును కంటి తుడుపు చర్యగా అభివర్ణించింది. సహజంగా సిట్‌ను సీనియర్ అధికారులతో ఏర్పాటు చేస్తారని, కానీ డీజీపీ ఏర్పాటు చేసిన సిట్‌లో మెజార్టీ సభ్యులు ఇన్‌స్పెక్టర్లు, కానిస్టేబుళ్లే ఉన్నారని వ్యాఖ్యానించింది. కేసు దర్యాప్తులో విఫలమైన పట్టాభిపురం పోలీసులపై చర్యలు తీసుకోవాల్సింది పోయి వారికి సిట్‌లో స్థానం కల్పించడం ఏంటని ప్రశ్నించింది. డీజీపీనే స్వయంగా కోర్టుకు పిలిచి వివరణ కోరతామంటూ ఓ దశలో ఆయన హాజరుకు ఆదేశాలు ఇచ్చేందుకు సిద్ధమైంది. పోలీసుల తరఫున ఎస్‌జీపీ విష్ణుతేజ స్పందిస్తూ.. సోమవారం వరకు గడువు ఇవ్వాలని అభ్యర్థించారు. ఆలోపు బాలిక ఆచూకీ కనుగొని కోర్టు ముందు హాజరుపరుస్తామన్నారు. దీంతో శాంతించిన జస్టిస్ బట్టుదేవానంద్, జస్టిస్ జి. తుహిన్ కుమార్‌తో కూడిన ధర్మాసనం వ్యాజ్యంపై విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

**ట్రాప్ చేసి తీసుకెళ్లాడు: బాలిక తండ్రి**

పదో తరగతి చదువుతున్న తన కుమార్తె ట్యూషన్‌కు వెళ్లి కనిపించకుండా పోయిందని గుంటూరుకు చెందిన ఓ వ్యక్తి ఈ ఏడాది జూన్ 9 పట్టాభిపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్టా ద్వారా పరిచయమైన షేక్ జాన్ సైదా అనే వ్యక్తి ట్రాప్ చేసి తన కుమార్తెను తీసుకెళ్లారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు నమోదు చేసి మూడు నెలలు కావస్తున్నా, తన కుమార్తె ఆచూకీని కొనుగొనడంలో పోలీసులు విఫలమయ్యాయని, ఆమెను కోర్టు ముందు హాజరుపర్చి తమకు అప్పగించేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ తండ్రి హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు.

# కొబ్బరికాయ కొట్టి చేతులు దులుపుకున్నారు

(మొదటి పేజీ తరువాయి)

నైజమని మండిపడ్డారు. గత ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలు గమనిస్తున్నారని, కానీ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చిత్తశుద్ధితో వ్యవహరించిందని సీఎం స్పష్టం చేశారు. పాతబస్తీ అభివృద్ధిపై గత పాలకులకు ఎలాంటి చిత్తశుద్ధి లేదని, కేవలం మాటల గారడీతో కాలం వెళ్లదీశారని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రత్యేక నిధులు కేటాయించి, అసంపూర్తిగా ఉన్న పనులను వేగంగా పరుగులు పెట్టించి నేడు ప్రజలకు అంకితం చేశామని తెలిపారు. నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలనుకుంటున్న తమ ప్రభుత్వాన్ని, గత పాలకులే అడుగడుగునా అడ్డుకోవాలని చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇదే వేదికగా నగర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక ప్రకటనలు చేస్తూ.. ఎన్నికల సమయంలోనే రాజకీయాలు ఉండాలని, ఎన్నికలు ముగిశాక అభివృద్ధి ఒక్కటే మన అందరి లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ అడిగిన ప్రతీ అభివృద్ధి పనులను వెంటనే మంజూరు చేస్తామని, వచ్చే ఎన్నికల్లోగా గౌలిగూడ నుంచి చాంద్రాయణగుట్ట వరకు మెట్రో రైలును పూర్తి చేసి తాము అదే మెట్రోలో వచ్చి ఓట్లు అడుగుతామని ధీమా వ్యక్తం చేశారు. గత పాలకులు పదేళ్లలో చేయని అభివృద్ధిని, తాము కేవలం కొద్ది కాలంలోనే చేసి చూపుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

# ఆహార భద్రతకు వాతావరణ ముప్పు

(మొదటి పేజీ తరువాయి)

ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించవచ్చు. ఆహారంలో పోషక వైవిధ్యాన్ని పెంచవచ్చు. కానీ కొన్ని కార్యక్రమాలు, ప్రచారాలతో రైతుల పంట ఎంపిక మారదని వ్యవసాయ పరిశోధకులు చెప్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు వ్యవస్థలో మార్పు రావాలనీ, మద్దతు ధర, మార్కెట్, నిల్వ, ప్రాసెసింగ్, రవాణా వంటి మొత్తం వ్యవస్థ ప్రత్యామ్నాయ పంటలకు అనుకూలంగా మారాలని సూచిస్తున్నారు.?

వాతావరణ సంక్షోభాన్ని రైతు ఒంటరిగా ఎదుర్కోలేడు వాతావరణ పరిస్థితులపై రైతులకు ముందస్తు సమాచారం సకాలంలో చేరాలి. వేడి తరంగాలు, భారీ వర్షాలు, కరువు పరిస్థితులను ముందుగానే గుర్తించి పంట ప్రణాళికను మార్చుకునే అవకాశం కల్పించాలి. వాతావరణాన్ని తట్టుకునే విత్తనాలు, సూక్ష్మ సాగునీరు, వాటర్‌షెడ్ అభివృద్ధి, డిజిటల్ సలహాలు, పంట బీమా వంటి చర్యలను బలోపేతం చేయాలి. కేంద్రం రైతులపై ప్రమాదాన్ని నెట్టివేసి.. తర్వాత పరిహారం ఇచ్చే విధానానికి బదులుగా ప్రమాదాన్ని ముందుగానే తగ్గించే విధానాన్ని అవలంభించాలని నిపుణులు సూచిస్తున్నారు.

**ధాన్యం మాత్రమే కాదు.. గిడ్డంగులనూ కాపాడాలి**

వాతావరణ ముప్పు పొలంలోనే ఆగదు.. వరదల్లో గిడ్డంగులు దెబ్బతింటే ధాన్యం నష్టపోతుంది. అధిక ఉష్ణోగ్రతలతో నిల్వ నష్టం పెరుగుతుంది. రవాణా వ్యవస్థ దెబ్బతింటే మార్కెట్లకు సరఫరా ఆగిపోతుంది. అందుకు వరదలను తట్టుకునే గిడ్డంగులు, మెరుగైన కోల్డ్‌చైన్‌లు, ఉష్ణోగ్రతలను తట్టుకునే నిల్వ వ్యవస్థలు, బలమైన రవాణా మౌలిక వసతులు అవసరమని నిపుణులు చెప్తున్నారు.

**కేంద్రం వద్ద సమాధానం కరువు**

కేంద్రంలోని మోడీ సర్కారు వ్యవసాయం, రైతుల విషయంలో గొప్పలు పెద్ద ఎత్తున చెప్పుకుంటోంది. రికార్డు స్థాయిలో ఆహార ధాన్యాల ఉత్పత్తి గణాంకాలను చూపిస్తూ ఆహార భద్రత సాధించామని చెప్పుకుంటోంది. అయితే రేపటి వాతావరణ సంక్షోభంలో కూడా రైతు పండించగలడా? ప్రజలకు అందుబాటు ధరలో పోషకాహారం దొరుకుతుందా? నీటి వనరులు మనగలవా? పంట నష్టపోతే రైతుకు రక్షణ ఉంటుందా? అన్న ప్రశ్నలకు మోడీ ప్రభుత్వం వద్ద సమాధానం లేదనే చెప్పాలి.

**కావాల్సింది ప్రచారం కాదు.. విధాన మార్పు**

ఆహార భద్రతను రేషన్ బియ్యం, గోధుమల పంపిణీగా పరిమితం చేయకుండా.. నీరు, వ్యవసాయం, పోషణ, నిల్వ, రవాణా, మార్కెట్లను కలిపిన సమగ్ర విధానంగా మార్చాలి. "భారత్ గతంలో ఆహార కొరతను అధిగమించింది. ఇప్పుడు వాతావరణ సంక్షోభాన్ని అధిగమించాల్సిన దశ వచ్చింది. మోడీ ప్రభుత్వం.. విజయాలను ప్రచారం చేసుకోవడం కంటే.. భవిష్యత్ ప్రమాదాలను ఎదుర్కొనే విధానాలను రూపొందించాలి" అని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు. లేకపోతే 'రికార్డు ఉత్పత్తి' అనే పేరు మిగిలినా.. రైతుకు భద్రత, ప్రజలకు పోషకాహారం, దేశానికి సుస్థిరమైన ఆహార భవిష్యత్ మాత్రం ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.ఖీశీశీ

**బియ్యం-గోధుమలపై ఆధారపడటం**

బియ్యం, గోధుమలు దేశ ఆహార భద్రతకు కీలకమైన పంటలు. అయితే ప్రభుత్వ కొనుగోళ్లు కొన్ని పంటలు, కొన్ని ప్రాంతాలకే పరిమితం కావడంతో వ్యవసాయ వ్యవస్థలో ప్రమాదపు సంకేతాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా అనేక ప్రాంతాల్లో భూగర్భజలాలు తీవ్రంగా క్షీణిస్తున్నప్పటికీ.. అధిక నీరు అవసరమయ్యే పంటల చుట్టూ ఏర్పడిన కొనుగోలు, మద్దతు వ్యవస్థలను మార్చడంలో కేంద్రం తగినంత వేగం చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి. "రైతును పంట మార్చాలని చెప్పడం సులభం. కానీ ప్రత్యామ్నాయ పంటకు ఖచ్చితమైన మార్కెట్, ధర, ప్రభుత్వ కొనుగోలు, నిల్వ, ప్రాసెసింగ్ హామీ ఇవ్వకుండా రైతు ఎందుకు మారుతాడు?" అని వ్యవసాయ నిపుణులు చెప్తున్నారు. ఇదే ఇప్పుడు మోడీ ప్రభుత్వ వ్యవసాయ విధానానికి అసలు పరీక్షగా వివరిస్తున్నారు.

# ఎల్‌నినో తీవ్రం!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకోవాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో అజెండా అంశాలపై చర్చ తర్వాత పలు అంశాలపై సీఎం మంత్రులతో మాట్లాడారు. ఎల్‌నినోపై సుదీర్ఘ చర్చ జరిగింది. తాగునీటికి ఎట్టి పరిస్థితుల్లో ఇబ్బందులు తలెత్తకూడదని, భూగర్భ జలాల పరిస్థితిని అంచనా వేస్తూ అవసరమైన చోట్ల బోర్లు వేసైనా తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఆ తర్వాతి ప్రాధాన్యం పశువులు, పశుగ్రాసానికి ఇవ్వాలని కోరారు. ఇప్పటికే వేసిన పంటలకు నీటి కొరత లేకుండా చూడాలని, ఎల్‌నినో కారణంగా ఒక్క ఎకరా కూడా ఎండడానికి వీల్లేదని స్పష్టం చేశారు. అదే సమయంలో వ్యవసాయ అనుబంధ రంగాల్లో జీఎస్‌డీపీ తగ్గకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్‌నినో పరిస్థితులను ఎప్పటికప్పుడు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. తాను ఈ రోజే కేంద్రానికి లేఖ రాస్తానని చెప్పారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు వ్యవ సాయ మార్కెట్ కమిటీలను, సాగునీటి వినియోగదా రుల సంఘాలను భాగస్వాములను చేయాలని సూచించారు.

**గొడ్డలి పార్టీ ప్రచారంపై జాగ్రత్త**

ఓపక్క రాష్ట్రంలో పరిస్థితులు తీవ్ర వర్షాభావంతో కరువు ఛాయలను తలపిస్తుంటే.. గొడ్డలి పార్టీ మాత్రం దీనిని కూడా రాజకీయం చేస్తోందని సీఎం ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రాజెక్టుల్లో నీళ్లున్నా పంటలకు ఇవ్వడం లేదని తప్పుడు ప్రచారం చేస్తోందని.. దీనిని గట్టిగా తిప్పికొట్టాలని మంత్రులను ఆదేశించారు. 'తప్పుడు ప్రచారాలతో ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు గొడ్డలి పార్టీ ప్రయత్నిస్తోంది. మనం సమర్థంగా ప్రజలకు, రైతులకు చెప్పి వారిని చైతన్యవంతులను చేయాలి. అవసరమైతే వారితో గ్రామస్థాయిలో సమావేశాలు ఏర్పాటు చేయాలి' అని కోరారు. వెలిగొండ ప్రారంభోత్సవం, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలను గొడ్డలి పార్టీ తన ఘనతగా తప్పుడు ప్రచారం చేసుకుంటోందన్నారు. కూటమి ప్రభుత్వం చేసే ప్రతి మంచినీ ప్రజలకు వివరించాలని కోరారు. మంత్రులు మరింతగా క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలన్నారు. తమిళనాడులో విజయ్ పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారనేది గమనించాలని సూచించారు.

**నిత్యావసరాల ధరలపై దృష్టి పెట్టండి**

ఎల్‌నినో సాకుతో నిత్యావసర ధరలు పెంచేందుకు ప్రయత్నాలు జరుగుతాయని, నిత్యం పర్యవేక్షిస్తూ ధరలను కట్టడి చేయాలని సీఎం మంత్రులను కోరారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, అచ్చెన్నాయుడు, పయ్యావుల కేశవ్ ఈ బాధ్యత చేపట్టాలని సూచించారు. జిల్లాల్లో జటిలమైన సమస్యల పరిష్కారంపై ఇన్‌చార్జి మంత్రులు దృష్టిపెట్టాలని చెప్పారు. తేలని సమస్యలను ఇన్‌చార్జి మంత్రి.. సంబంధిత శాఖ మంత్రి వద్దకు తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో ప్రజల అధీనంలో ఉన్న సుమారు 6వేల ఎకరాలకు పట్టాలు లేవని, స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి వారు పోరాడుతూనే ఉన్నారని.. దీనికి 2 నెలల్లో పరిష్కారం చూపాలని ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఇలాంటి సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు.

# భారతదేశ ఆర్థిక వృద్ధి ప్రపంచానికి విశ్వాసాన్ని ఇస్తోంది

(మొదటి పేజీ తరువాయి)

మరింత విస్తృతమైన, వ్యూహాత్మక సంబంధాన్ని నిర్మించుకుంటున్నాయని ఆయన అన్నారు.

"నేడు ప్రపంచం గొప్ప సంక్షోభ కాలాన్ని ఎదుర్కొంటోంది. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయి. ఆహారం, ఇంధనం లేదా సరఫరా గొలుసులు ఏవైనా సరే, ప్రతి రంగం అనిశ్చితితో ప్రభావితమైంది," అని మోదీ అన్నారు.

"ఈ సవాలుతో కూడిన వాతావరణంలో కూడా భారత ఆర్థిక వ్యవస్థ తన వేగాన్ని కొనసాగించింది. గత త్రైమాసికంలో మేము 7.8 శాతం వృద్ధిని నమోదు చేశాము. నేడు, భారతదేశ వృద్ధి గాథ ప్రపంచానికి విశ్వాసానికి, కొత్త అవకాశాలకు మూలంగా మారుతోంది," అని ఆయన అన్నారు. రెండు దేశాల మధ్య రక్షణ, భద్రతా సహకారాన్ని మొత్తం సంబంధానికి ఒక "కీలక స్తంభం"గా మోదీ అభివర్ణించారు. "ఈ రోజు, ఇరు దేశాల మధ్య సైనిక మార్పిడులు మరియు శిక్షణ సహకారాన్ని పెంపొందించుకోవడానికి మేము అంగీకరించాము. మా ప్రభుత్వాలు మరియు రక్షణ పరిశ్రమల మధ్య కుదిరిన ఒప్పందాలు రక్షణ సహ-అభివృద్ధి మరియు సహ-ఉత్పత్తికి కొత్త అవకాశాలను తెరుస్తాయి," అని ఆయన అన్నారు. "నేరాల నిర్మూలనలో మా సంస్థల మధ్య నిఘా సమాచార మార్పిడి మరియు సహకారాన్ని మరింత బలోపేతం చేస్తాము," అని మోదీ పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య ప్రజల సంబంధాలు పరస్పర సహకారానికి ఒక "గొప్ప శక్తి" అని ప్రధానమంత్రి అన్నారు. స్టార్టప్‌ల మధ్య సంబంధాలను బలోపేతం చేయడానికి, సముద్ర రంగంలో సామర్థ్య నిర్మాణాన్ని పెంపొందించడానికి ఇరుపక్షాలు అంగీకరించాయని ఆయన తెలిపారు.

'వాళ్లకు ఒకే రకమైన వాటిని పోల్చడం తెలియదు, వాళ్లు నిరుద్యోగులు': జీడీపీ విమర్శలకు గోయల్ గట్టి సమాధానం.

"మేము విశ్వవిద్యాలయ, పరిశోధన సహకారాన్ని కూడా బలోపేతం చేస్తాము. అలాగే, ప్రతిభావంతుల బదిలీని సులభతరం చేయడానికి, త్వరలో 'వలస మరియు బదిలీ భాగస్వామ్య ఒప్పందం' కుదుర్చుకుంటాము," అని ఆయన అన్నారు. ఉక్రెయిన్, పశ్చిమ ఆసియాలోని సంఘర్షణలను చర్చలు, దౌత్యం ద్వారా పరిష్కరించుకోవాలని మోదీ మరోసారి పిలుపునిచ్చారు. "భారత్, బెల్జియం రెండూ చట్టబద్ధ పాలన, సంప్రదింపులు, దౌత్యంపై విశ్వాసం ఉంచుతాయి. అది ఉక్రెయిన్ అయినా, పశ్చిమ ఆసియా అయినా, సంఘర్షణలకు త్వరితగతిన ముగింపు పలికి శాంతి నెలకొల్పే అన్ని ప్రయత్నాలకు మేము మద్దతు ఇస్తాము," అని ఆయన అన్నారు. అన్ని రకాల ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి భారతదేశం, బెల్జియం కట్టుబడి ఉన్నాయని ప్రధానమంత్రి అన్నారు.

## సంపాదకీయం

# జెన్ జీ నిజంగా అన్ ఫిట్టా....




సమాజంలో ఉద్యోగం, వ్యాపారం చేయడం ఎంత ముఖ్యమో.. మనుషులతో సంబంధాలు నెలకొల్పడం అంతే ముఖ్యం. మనుషుల మధ్య కమ్యూనికేషన్ ఉంటేనే కెరీర్లో ఎదగడం లేదా వ్యాపారంలో రాణించడం జరుగుతుంది. అయితే కొన్ని నివేదికల ప్రకారం ప్రస్తుతం ఉన్న జెన్ జీ గా పిలిచే యువతలో కమ్యూనికేషన్స్ స్కిల్స్ చాలా తక్కువగా ఉన్నాయని.. దీంతో ఇది వీరికి అడ్డంకిగా మారుతుందని ప్రముఖ సంస్థ లింక్డ్ ఇన్ తెలిపింది. దీంతో యువత తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పేర్కొంది. ఈ నివేదిక గురించి పూర్తి వివరాల్లోకి వెళ్తే..ప్రముఖ కమ్యూనికేషన్స్ సంస్థ లింక్డ్ ఇన్ తెలిపిన వివరాల ప్రకారం భారతదేశంలో సుమారు 83 శాతం మంది జెన్ జడ్ యువత నెట్వర్కింగ్ చేయడంలో వెనుకబడి ఉన్నట్లు తెలిపింది. నెట్వర్కింగ్ అంటే చాలామంది కేవలం ఉద్యోగం కోసం ఇతరులను పరిచయం చేసుకోవడమే అని అనుకుంటున్నారు. కానీ వారి జీవిత విశేషాలను ఇతరులతో పంచుకోవడం.. కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం .. కెరీర్ కు సంబంధించిన విషయాలను అడగడం.. ఇతరులకు చెప్పడం వంటివి ఉంటాయి.అయితే ఈ విషయాలను ఇతరులతో పంచుకోవడంలో ఇప్పుడున్న యువతలో మొహమాటం ఎక్కువగా ఉన్నట్లు లింక్డ్ ఇన్ సంస్థ తెలిపింది. దీంతో యువత ఇతరులు ఏమనుకుంటారో నన్న భయం ఎక్కువగా కలిగి ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కెరీర్ ప్రారంభ విషయంలో యువత సీనియర్లను ఏదైనా విషయాలను అడగాలంటే చాలా భయపడిపోతున్నారు. అంతేకాకుండా తాము ఏదైనా మాట్లాడితే తిరస్కరిస్తారేమోనని.. తమ ఆలోచన ఇతరికి నచ్చదేమోనన్న మొహమాటంతో ఉన్నట్లు తెలుపుతున్నారు.లింక్డ్ ఇన్ తెలిపిన మరో విషయం ఏమిటంటే.. యువతలో 79 శాతం తమ కెరీర్ నెట్వర్క్ ప్రాముఖ్యత గుర్తిస్తున్నప్పటికీ.. 52 శాతం మందికి అసలు నెట్వర్కింగ్ ను ఎలా ప్రారంభించాలో తెలియడం లేదని తెలిపింది. ఇందులో భాగంగా ఇతరులతో ఎలా మాట్లాడాలి? మొదటి మెసేజ్ ఎలా పంపాలి? తమ గురించి ఎలా పరిచయం చేసుకోవాలి? అనే విషయాలను ఇతరులతో పంచుకోవడం లేదు.అయితే కొందరు నిపుణులు తెలుపుతున్న ప్రకారం నెట్వర్కింగ్ అంటే ఒకేరోజు వందల మందిని పరిచయం చేసుకోవడం కాదు.. ముందుగా తమ రంగానికి సంబంధించి ఒకరితో పరిచయం ఏర్పడి ఆ తర్వాత నెట్వర్క్ పెంచుకొని అవసరం ఉంటుందని తెలుపుతున్నారు. తమ ప్రొఫెషనల్ స్పేస్ ఇతరులను ప్రశ్నలు అడగడం.. కొత్త పరిచయాలు చేసుకోవడం వల్ల సమాజంలో అవగాహన కలుగుతుందని అంటున్నారు. అయితే నేరుగా ఇతరులతో మాట్లాడే ఇష్టం లేకపోతే సోషల్ మీడియా ఫ్లాట్ఫారం ద్వారా కూడా పరిచయం చేసుకోవచ్చని తెలుపుతున్నారు.యువతలో నెట్వర్కింగ్ సమస్త ఉంటే భారీగా అవకాశాలు కోల్పోయే అవకాశం ఉందని లింకుడ్ ఇన్ సంస్థ తెలుపుతుంది. కొన్నిసార్లు కేవలం ఆన్లైన్ ద్వారా మాత్రమే కాకుండా మనకు తెలిసిన వ్యక్తుల ద్వారా కూడా అవకాశాలు పొందే అవకాశం ఉంటుందని.. ఈ నేపథ్యంలో పరిచయాలు ఎంతో ముఖ్యమని అంటున్నారు. అంతేకాకుండా తమకు ఉన్న నైపుణ్యాలను ఇతరులకు తెలపాలంటే నెట్వర్కింగ్ ఎంతో అవసరమని చెబుతున్నారు. నేషనల్ అసోసియేషన్ ఆఫ్ కాలేజెస్ అండ్ ఎంప్లాయర్స్ ఇతర మానవ వనరుల సర్వేల్లోని తాజా గణాంకాలు కొత్త గ్రాడ్యుయేట్ల పనితీరుపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. ఔంఅఇ అంటే నేషనల్ అసోసియేషన్ ఆఫ్ కాలేజెస్ అండ్ ఎంప్లాయర్స్ అని చెప్పాలి. ఇది అమెరికాలోని ఒక ప్రముఖ ప్రొఫెషనల్ లాభాపేక్షలేని సంస్థ, ఇది ఉన్నత విద్య మరియు కార్పొరేట్ ప్రపంచం మధ్య ఒక వంతెనలా పనిచేస్తుంది. 71.2 శాతం కంపెనీలు కొత్త గ్రాడ్యుయేట్లు ఉద్యోగానికి కేవలం కొంతమేరకు సిద్ధంగా ఉన్నారని గుర్తించాయి. కేవలం 21.6% కంపెనీలు జెన్ జీలను జాబ్ చేయడానికి సిద్ధంగా ఉన్నారని భావించాయి. 7.2% ఎంప్లాయర్లు వారు అసలు సిద్ధంగానే లేరని అభిప్రాయపడ్డారు.: ఇటీవల నియమితులైన కొత్త గ్రాడ్యుయేట్ల ఆన్-జాబ్ పనితీరు అత్యంత సంతృప్తికరంగా లేదు అని 75 శాతం కంపెనీలు అంగీకరించాయి. 800 మందికి పైగా ఊఖీ అధికారులపై జరిగిన మరో సర్వేలో 37 శాతం అధికారులు, కొత్త గ్రాడ్యుయేట్‌కు ఉద్యోగం ఇవ్వడం కంటే రోబోట్ లేదా ౦ఎ టెక్నాలజీతో పని చేసుకోవడం మంచిదని చెప్పారు.కరోనా వ్యాప్తి సమయంలో సంవత్సరాల పాటు స్కూల్స్, కాలేజీలు మూసేశారు. ఈ సమయంలో అధిక స్క్రీన్ టైమ్, మనుషుల నుంచి దూరం పాటించడం, వర్క్ ఫ్రం హోమ్ లేదా ఆన్లైన్ క్లాసుల వాతావరణం కొనసాగింది. దాంతో యువతలో ముఖాముఖి సంభాషణ, పరస్పర సమన్వయం లేకపోవడంతో, వీరిలో ఆఫీస్ నార్మ్స్ లో భారీ లోపం కనిపిస్తోంది.కొత్త విద్యార్థులు కమ్యూనికేట్ చేయడంలో, నిజ జీవిత సమస్యలను ఎదుర్కొనడంలో గత తరాల కంటే చాలా వెనుకబడుతున్నారని న్యూయార్క్ యూనివర్సిటీకి చెందిన సైకాలజీ ప్రొఫెసర్ టెస్సా వెస్ట్ అన్నారు. ఇప్పుడు ఈ లోపాలను సరిచేసి, వారిని ప్రవర్తనా నైపుణ్యాలు మెరుగుపరిచే బాధ్యత విద్యాసంస్థలపై పడింది.ఈ పెరుగుతున్న స్కిల్స్ గ్యాప్‌ను తగ్గించి, యువతను వర్క్ ప్లేస్‌కు అనుగుణంగా మార్చేందుకు నిపుణులు అనేక ముఖ్య సూచనలు చేశారు ప్రొఫెసర్ టెస్సా వెస్ట్ ప్రకారం, టెక్నికల్ స్కిల్స్ సులభంగా నేర్పించవచ్చు. కానీ మాట్లాడటం, చర్చించడం, అభిప్రాయ భేదాలను తెలపడం, టీమ్‌తో కలిసి పనిచేయడం నేర్చుకోవడానికి ఎక్కువ సమయం పడుతుంది. అందువల్ల విద్యాసంస్థలు సాఫ్ట్ స్కిల్స్‌పై ఫోకస్ చేయక తప్పదు. యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా ప్రొఫెసర్ పీటర్ కాపెల్లీ మాట్లాడుతూ.. ఈ సమస్యకు కేవలం కాలేజీలు, విద్యా సంస్థలనే బాధ్యులుగా చేయడం సరికాదు. కంపెనీలు కూడా ఎంట్రీ లెవల్ ఉద్యోగుల శిక్షణ, మెంటార్షిప్‌పై ఫోకస్ చేయడం లేదు. 2000ల తర్వాత నుంచి కొత్త ఉద్యోగులకు ఇచ్చే శిక్షణ గంటలు నిరంతరం తగ్గుతూ వస్తున్నాయని తెలిపారు.




# బేకరీల్లో బొద్దింకల బీభత్సం..!

**- ఆహార భద్రత అధికారులు ఎక్కడ..?**
**- పైన పటారం.. లోన లొటారం!**
**- బయట మెరుపులు.. లోపల అపరిశుభ్రత ఆరోపణలు**

**అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాల్లో ఆహారభద్రత శాఖాధికారులు తమకేమీ సంబంధం లేదన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులు, ఆహార తయారీ కేంద్రాలు,ఫ్యాక్టరీలు, నిల్వ ఉంచే గోదాములను క్రమం తప్పకుండా తనిఖీ చేస్తారు. అక్కడ పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో నిశితంగా పరిశీలించాలి..... మరి ఉమ్మడి జిల్లాలో ఎక్కడ కనిపించడం లేదు...నాణ్యత లేని, గడువు ముగిసిన లేదా రసాయనాలతో కల్తీ చేసిన ఆహార పదార్థాలను గుర్తించి, వాటి విక్రయాలను నిలిపివేయాలి... మరి అధికారులు ఎక్కడ కనిపించడం లేదని బలమైన వాదనలు వినిపిస్తున్నాయి. అపరిశుభ్రత ప్రాంతాల్లో వంటలు... నాణ్యతలేని ఆహారపదార్థాల తయారీలతో అనేక మంది ఆస్పత్రుల పాలయ్యారు. ఏదైనా ఘటన జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేయడం... శాంపిల్స్ సేకరించడం... ల్యాబ్‌కు పంపడంతోనే ఆహార భద్రతశాఖాధికారులు సరి పెడుతున్నారు. కనీసం శాంపిల్స్ రిజల్ట్ ఏమందని ల్యాబ్ అధికారులతో ఆరా తీసిన పాపాన పోలేదని జిల్లా వాసులు చెబుతున్నారు.**

**హిందూపురం – సూర్య వాస్తవం**

బేకరీలు అంటే రుచికరమైన ఆహార పదార్థాలకు నిలయంగా ఉండాలి. అయితే పరిశుభ్రత విషయంలో నిర్లక్ష్యం జరిగితే అదే ఆహారం ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉంది. ఆకర్షణీయమైన రూపం, రుచికరమైన వాసనతో వినియోగదారులను ఆకట్టుకునే బేకరీ ఉత్పత్తుల తయారీ, నిల్వ, విక్రయాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా? అన్న ప్రశ్నలు తాజాగా తెరపైకి వస్తున్నాయి.శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్ పరిధిలో ఆహార భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. హిందూపురం వెళ్లే ప్రధాన రహదారిలోని చిన్నయ్య టీ స్టాల్ సర్కిల్ సమీపంలో ఉన్న మారుతి బేకరీలో విక్రయించే ఆహార పదార్థాల పరిశుభ్రతపై కొందరు వినియోగదారులు ఆరోపణలు చేస్తున్నారు.ఇటీవల ఇక్కడ కొనుగోలు చేసిన కారం వేరుశనగల్లో బొద్దింక కనిపించిందని కొందరు వినియోగదారులు ఆరోపించడం కలకలం రేపింది. ఆహార పదార్థంలో పురుగు కనిపించిందన్న ఆరోపణలతో వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఆరోపణల నేపథ్యంలో బేకరీలో ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయ ప్రాంతాల్లో పరిశుభ్రతా ప్రమాణాలు ఎలా ఉన్నాయన్నది అధికారుల తనిఖీలతో స్పష్టత రావాల్సి ఉంది.





**రద్దీ ప్రాంతంలో బేకరీ.. మరింత జాగ్రత్త అవసరం**

రొద్దం బస్టాండ్ పరిసర ప్రాంతం నిత్యం రద్దీగా ఉంటుంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ఆసుపత్రులకు వెళ్లే రోగులు, వివిధ ప్రాంతాలకు ప్రయాణించే ప్రయాణికులు పెద్ద సంఖ్యలో ఈ ప్రాంతంలో సంచరిస్తుంటారు. ఇలాంటి ప్రాంతాల్లో ఆహార పదార్థాల నాణ్యత, పరిశుభ్రత విషయంలో మరింత అప్రమత్తత అవసరమని స్థానికులు చెబుతున్నారు.

**అధికారుల తనిఖీలు ఎక్కడ..?**

హోటళ్లు, రెస్టారెంట్లు, బేకరీలు, స్వీట్ షాపులు, ఆహార తయారీ కేంద్రాలు, నిల్వ గోదాముల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారో లేదో పరిశీలించాల్సిన బాధ్యత ఆహార భద్రత శాఖపై ఉంది. ముఖ్యంగా నాణ్యత లేని, గడువు ముగిసిన లేదా కల్తీ అనుమానం ఉన్న ఆహార పదార్థాలను గుర్తించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది.అయితే అనంతపురం ఉమ్మడి జిల్లాలో ఆహార భద్రత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారా? అన్న ప్రశ్నలు ప్రజల్లో వినిపిస్తున్నాయి. ఏదైనా ఘటన వెలుగులోకి వచ్చిన తర్వాత మాత్రమే అధికారులు హడావుడిగా తనిఖీలు చేసి శాంపిల్స్ సేకరిస్తున్నారనే విమర్శలు కూడా ఉన్నాయి.

**శాంపిల్స్ సేకరణతోనే సరిపెట్టొద్దు**

ఆహార పదార్థాలపై అనుమానాలు వ్యక్తమైనప్పుడు శాంపిల్స్ సేకరించి పరీక్షలకు పంపడం మాత్రమే కాకుండా, వాటి ఫలితాలను కూడా పర్యవేక్షించి అవసరమైన తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రయోగశాల పరీక్షల ఫలితాలు ఏమిటి? నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అన్న విషయాలను సంబంధిత అధికారులు స్పష్టం చేయాల్సిన అవసరం ఉందని జిల్లా వాసులు అంటున్నారు.బేకరీ బయట కనిపించే మెరుపుల కంటే.. లోపల పాటించే పరిశుభ్రతే ముఖ్యం. ప్రజల ఆరోగ్యంతో ముడిపడిన ఆహార భద్రత విషయంలో అధికారులు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.రొద్దం బస్టాండ్ పరిధిలోని బేకరీలు, స్వీట్ షాపులు, ఇతర ఆహార విక్రయ కేంద్రాలపై ఆహార భద్రత శాఖ ప్రత్యేక దృష్టి సారిస్తుందా..? లేక ఏదైనా ఘటన జరిగిన తర్వాతే స్పందిస్తుందా..? అనేది వేచి చూడాలి.



## ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడుగా ఎప్పికైన డి.రంగనాథ్



**డోన్ – సూర్య వాస్తవం :** డోన్ మండలం కొత్తబురుజు గ్రామంలో రాముడు, లక్ష్మీదేవి పుణ్య దంప తులకు పంటగా జన్మించిన రంగనాథ్ 16 సంవత్సరాలుగా సాగుతున్న నిరంతర అభ్యసన,బోధన,ఉపా ధ్యాయ ఉద్యోగ ప్రస్థానంలో వృత్తిని దైవంగా భావించి అనుపమానమైన బోధనా వ్యవసాయంలో అగణితజ్ఞా న ఫలాలను సాగు చేస్తున్న మన రా ష్ట్రోపాధ్యాయ సంఘం సభ్యులు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశా ల (మెయిన్)వెంకట నాయుని పల్లె నందు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయు లుగా పనిచేస్తున్న నిత్య కృషీవలు డు డి.రంగనాథ్ కి జిల్లాస్థాయి ఉత్త మ ఉపాధ్యాయ అవార్డు వచ్చినం దుకు డి.రంగనాథ్ కి ఉపా ధ్యాయ దినోత్సవ సందర్భంగా అం దిస్తున్న అభినందన అక్షర చందనం అచ్చమై న ప్రకృతికి,స్వచ్ఛమైన మనసులకు అవ్యాజమైన ప్రేమలకు,అనురాగప రిమళాలకు ఆలవాలమైన ఉపా ధ్యాయ వృత్తిని దైవంలా భావించి ప్రే మతో ఇష్టంతో,ఆసక్తితో వృత్తిలో ప్ర వేశించి పనిచేసిన ప్రతిచోటా పసి హృదయాలను ప్రేమించి,లాలిం చి,బుజ్జగించి జ్ఞానబీజలను వారి మెదళ్ళలో నాటి అంకిత భావానికి ప్రతి రూపంగా నిలిచిచదువు అంటే కేవలం అక్షర జ్ఞానం మాత్రమే కాద ని,ప్రాథమిక విద్య అంటే పలకా బల పం పట్టుకోవడం కాదని,సమగ్రమూ ర్తిమత్వ నిర్మా ణానికి బీజం వేస్తూ గురుకుల,ఆదర్శ పాఠశాలల ప్రవేశ పరీక్షల్లో విద్యార్థుల విజయానికి త నదైన శిక్షణ ఇచ్చి అత్యధిక సంఖ్య లో ఎంపికను సాధించి పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల శాతాన్ని పెంచి, స్నాతకోత్సవాన్ని కార్పొరేట్ సంస్థల కు దీటుగా నిర్వహించి, భాషా,శారీ రక,మానసిక వికాసానికి తగు ప్రో త్సాహం ఇచ్చి,విద్యార్థులకు,తల్లి దండ్రులకు ఇష్టమైన గురువుగాహృ దయాల్లో నిలిచిన డి.రంగనాథ్ మీ మార్గం.మీ బోధనం.మీ అంకిత భా వంమీ విధి నిర్వహణం. ఉపాధ్యా యులందరికీ నిరంతరం అనుసరణీ యం ఆదర్శ నీయం మీ కృషిని.మీ పట్టుదలను.మీ సేవను. శ్లాఘిస్తూ. ఉత్తమ ఉపాధ్యాయునిగా పరిగణి స్తూ అందిస్తున్న అభినందన అక్షర చందనం.

## శ్రీ సీతారామాంజనేయ దేవస్థానంలో రామేశ్వరం 22 బావుల తీర్థాలవితరణ

**అనంతపురం- సూర్య వాస్తవం :** అనంతపురం పట్టణంలో శ్రావణమాసం 4వ శనివారం సందర్భంగా రామేశ్వరం 22 బావుల తీర్థాల నీరు ప్రతి ఒక్కరికి ఉచితంగా అందజేయడం జరుగుతుందని తెలిపారు శ్రీవారి సేవకులు, శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయ కమిటీఆళ్లగడ్డ రాము , కావున భక్తాదులు శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవాలయం విచ్చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరు. ఉదయం 7:30 గంటలకు శివునికి పంచామృతాభిషేకం ఎనిమిది గంటలకు రామేశ్వర తీర్థ అభిషేకం 8:30 గంటలకు పుష్పర్చిన తొమ్మిది గంటలకు మహా మంగళారతి 9:30 గంటలకు రామేశ్వర తీర్థ వినియోగం మరియు తీర్థప్రసాదాలు పుచ్చుకోవాలన్నారు



## మసీద్-ఏ-షఫీ శంకుస్థాపనకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌కు ఆహ్వానం ...!

**- మసీదు నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే..**

**- మత పెద్దలు, ముస్లిం సోదరులకు ముందస్తు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే**





**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** అనంతపురం నియోజకవర్గ శాసనసభ్యులు దగ్గుపాటి ప్రసాద్, పట్టణ అధ్యక్షులు సుధాకర్ యాదవ్‌తో కలిసి జామియా మసీదు ముతవల్లి, రాష్ట్ర ముతవల్లిల సంఘం అధ్యక్షులు అల్‌హజ్ కే.ఎం. షకీల్ షఫీ స్వగృహానికి గురువారం విచ్చేశారు.ఈ సందర్భంగా ఆదివారం 06-09-2026 ఉదయం 11:30 గంటలకు జరగనున్న "మసీద్-ఏ-షఫీ" శంకుస్థాపన కార్యక్రమానికి అనివార్య కారణాల వల్ల తాను హాజరు కాలేకపోతున్న విషయాన్ని ఎమ్మెల్యే ముందుగానే తెలిపారు.అనంతరం మసీదు నిర్మాణం చేపట్టనున్న స్థలాన్ని నేరుగా సందర్శించి పరిశీలించారు. శంకుస్థాపన మహోత్సవానికి హాజరుకానున్న మత పెద్దలకు, ముస్లిం సోదరులందరికీ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముందస్తుగా శుభాకాంక్షలు తెలియజేశారు. తదుపరి కట్టుబడి బాబాజీ, షేక్ నూరు బాబాలను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి, వారితో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో పలువురు మత పెద్దలు, ముస్లిం పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకకు హాజరైన మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి...!

**- నూతన వధూవరులను ఆశీర్వదించిన రాప్తాడు మాజీ ఎమ్మెల్యే**



**అనంతపురం - సూర్య వాస్తవం :** పావగడ తాలూకాలోని బి.ఆర్. అంబేద్కర్ సముదాయ భవనంలో రామగిరి మండలం మంగాపురం గ్రామానికి చెందిన గంగన్న కుమారుడు రాజశేఖర్, మనుష దంపతుల వివాహ వేడుక ఘనంగా జరిగింది.ఈ వివాహ కార్యక్రమానికి రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి హాజరయ్యారు. నూతన వధూవరులను కలిసి శుభాకాంక్షలు తెలిపి, వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, అభిమానులు పాల్గొన్నారు.

## సురక్షిత విద్యా వాతావరణమే లక్ష్యంగా 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్...!'

**- విద్యాసంస్థల పరిసరాల్లో పోలీసుల విస్తృత తనిఖీలు**

**- 500 మీటర్ల పరిధిలోని 6 దుకాణాల తనిఖీ**

**- నిబంధనలు ఉల్లంఘించిన 4 దుకాణాల యజమానులకు జరిమానాలు**

**- త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ ఈగల్ సెల్ సంయుక్తంగా తనిఖీలు**

**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** జిల్లా ఎస్పీ పి. జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం త్రీటౌన్ పోలీసులు, జిల్లా ఈగల్ సెల్ అధికారులు సంయుక్తంగా 'ఆపరేషన్ సేఫ్ క్యాంపస్'లో భాగంగా విద్యాసంస్థల పరిసరాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు.నేతాజీ హైస్కూల్, పీఆర్కే జూనియర్ కాలేజీ, సన్‌లైన్ హైస్కూల్ తదితర విద్యాసంస్థల చుట్టుపక్కల 500 మీటర్ల పరిధిలోని ఆరు దుకాణాలను పోలీసులు తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత వస్తువులను విక్రయిస్తున్న నాలుగు దుకాణాల యజమానులకు జరిమానాలు విధించారు.విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు గురికాకుండా విద్యాసంస్థల పరిసరాల్లో నిఘా మరింత పెంచుతున్నట్లు పోలీసులు తెలిపారు. నిషేధిత వస్తువుల విక్రయానికి పాల్పడినా, అక్రమ లేదా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. "సురక్షితమైన విద్యా వాతావరణం... ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు పునాది" అని పోలీసులు పేర్కొన్నారు.



## రెండు నెలల్లో జల్ జీవన్ మిషన్

# పనులు పూర్తి చేయాలి...!

- పనుల పురోగతిపై ప్రతినెలా సమీక్ష నిర్వహిస్తాం
- కురుగుంట, సిండికేట్ నగర్‌లో పైప్‌లైన్ పనులు నెల రోజుల్లో పూర్తి
- 30 గ్రామాలకు తాగునీరు అందించడమే లక్ష్యం: కలెక్టర్ ఓ.ఆనంద్



**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** రాప్తాడు నియోజకవర్గంలో జల్ జీవన్ మిషన్ కింద చేపట్టిన తాగు నీటి సరఫరా పనులను రెండు నెలల్లోగా వేగ వంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం నెలకొన్న ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో తాగునీటి సమస్య తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి 30 గ్రామాలకు నీటిని అందించాలని సూచించారు. అనంతపురం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ఆధ్వర్యంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, సంబంధిత కాంట్రాక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు మండలాల్లో జరుగుతున్న జల్ జీవన్ మిషన్ పనుల పురోగతిని సమీక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా జల్ జీవన్ మిషన్ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. చిన్నచిన్న మరమ్మతులు ఉన్నా వెంటనే పరిష్కరించి నీటి సరఫరా ప్రారంభించాలని అధికారులకు సూచించారు.అనంతపురం రూరల్ మండలంలో సాయి పావని కంపెనీ రూ.40 కోట్లతో పనులు చేపట్టగా ఇప్పటివరకు రూ.18 కోట్ల మేర పనులు పూర్తయ్యాయని తెలిపారు. రూ.15.50 కోట్ల బిల్లులు చెల్లించగా, మరో రూ.2.50 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇంకా రూ.22 కోట్ల మేర పనులు పూర్తి చేయాల్సి ఉందన్నారు. ఈ సంస్థ పరిధిలో 31 గ్రామాల్లో పనులు జరుగుతున్నాయని తెలిపారు.ఆత్మకూరు మండలంలో సరస్వతి కంపెనీ రూ.50.43 కోట్లతో పనులు చేపట్టగా ఇప్పటివరకు రూ.38 కోట్ల పనులు పూర్తయ్యాయని, రూ.34 కోట్ల బిల్లులు చెల్లించామని, ఇంకా రూ.12.43 కోట్ల మేర పనులు చేయాల్సి ఉందన్నారు. ఆత్మకూరు, అనంతపురం రూరల్, రాప్తాడు పరిధిలోని పలు గ్రామాల్లో పనులు కొనసాగు తున్నాయని వివరించారు.పీఏబీఆర్ డ్యామ్ వద్ద 600 మీటర్ల మేర ప్రధాన పైప్‌లైన్ పనులు పెండింగ్‌లో ఉన్నాయని, ఫిల్టర్ బెడ్స్ పనులు ఇంకా ప్రారంభం కాలేదని ఎమ్మెల్యే తెలిపారు. క్లియర్ వాటర్ సంపు నుంచి ఆత్మకూరుకు నీటిని పంపింగ్ చేసే మోటర్లకు ఇప్పటివరకు ఆర్డర్లు ఇవ్వలేదన్నారు. పి.నారాయణపురం--పి.యాలేరు మధ్య హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కెనాల్ బ్రిడ్జి పనులు, ఆత్మకూరులో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంక్, సంపు, పంప్‌రూమ్, మోటర్ల పనులు పూర్తికావాల్సి ఉందన్నారు. పంపనూరు, చిన్నంపల్లి వద్ద మినీ ట్యాంకుల పనులను కూడా పూర్తి చేయాలని కోరారు. సత్యసాయి కార్మికులకు జీతాలు అందక ఇబ్బందులు ఎదురవు తున్నాయని, వారికి వెంటనే వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు.

**గడువులోగా మౌలిక వసతులు పూర్తి చేయాలి**

కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ తాగునీటి సరఫరా పనుల్లో ఎలాంటి జాప్యం ఉండ కూడదన్నారు. పంపింగ్ హౌస్ వద్ద రూ.60 లక్షల అంచనా వ్యయంతో కొత్త సాండ్ ఫిల్టర్లు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సంబంధిత ఆర్డర్ల ప్రక్రియను వెంటనే పూర్తి చేసి రెండు నెలల్లో పనులను పూర్తిచేయాలని సూచించారు.సబ్‌కాంట్రాక్టర్ ద్వారా కిర్లోస్కర్ కంపెనీ పంప్‌సెట్ల కోసం ఆర్డర్ ప్రక్రియను వేగవంతం చేసి మూడు, నాలుగు రోజుల్లో చెల్లింపులు పూర్తి చేసి అధికారికంగా ఆర్డర్ ఖరారు చేయాలని ఆదేశించారు. సాండ్ ఫిల్టర్లు, పైప్‌లైన్ల డయామీటర్ పెంపు, ఇతర సాంకేతిక మార్పులకు సంబంధించిన రివైజ్డ్ వర్కింగ్ ఎస్టిమేట్లకు వారంలోగా ఎస్ఈ, సీఈ స్థాయి అధికారుల ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు.కురుగుంట, సిండికేట్ నగర్ పరిధిలో మిగిలిన 350 మీటర్ల చొప్పున పైప్‌లైన్ పనులను నెల రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల నిర్వహణలో ఎదురయ్యే సమస్యలను ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో వెంటనే పరిష్కరించాలని సూచించారు.పీఏబీఆర్ డ్యామ్ నుంచే ప్రధాన నీటి సరఫరా ఆధారపడి ఉన్నందున పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. పనుల పురోగతిపై ప్రతినెలా సమీక్ష నిర్వహిస్తామని, ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా నిర్దేశిత గడువులోగా అన్ని పనులు పూర్తి చేయడమే ప్రాథమిక లక్ష్యమని స్పష్టం చేశారు.పీఏబీఆర్ వద్ద అవసరమైన 2.5 ఎకరాల భూమిలో 75 సెంట్లు మాత్రమే అందుబాటులోకి వచ్చాయని, ఇంకా 1.75 ఎకరాలు కేటాయించాల్సి ఉన్నందున వెంటనే చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఒడ్డుపల్లి సబ్‌స్టేషన్ వెనుక పీపీపీటీ నిర్మాణానికి అవసరమైన 10 సెంట్ల భూమిని కూడా త్వరగా అందించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కె.శ్రీనివాసులు, రాప్తాడు డీఈ శ్రీధర్, ఏఈలు, సంబంధిత కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవాలకు షరతులు....

# అనుమతులకు ఈ-పోర్టల్ ప్రారంభం...!

**- ఉచితంగా.. ఆన్‌లైన్‌లో నిరభ్యంతర పత్రం**

**- ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా మండపాలు ఏర్పాటు చేయాలి**

**- అనుమతి లేకుండా మండపాలు ఏర్పాటు చేస్తే చర్యలు ఎస్పీ పి.జగదీష్**





**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** వినాయక చవితి ఉత్సవాలను ప్రజలందరూ సురక్షితంగా, ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకునేలా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టిందని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపీఎస్ తెలిపారు. గణేష్ మండపాల ఏర్పాటుకు అవసరమైన అనుమతులను సులభంగా పొందేందుకు గణేష్ ఉత్సవ్ సింగిల్ విండో పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నిరభ్యంతర పత్రాలు మంజూరు చేస్తున్నట్లు వెల్లడించారు.గతంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు అనుమతుల కోసం వివిధ ప్రభుత్వ శాఖల కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదని, ఆ ఇబ్బందులను తొలగించేలా పోలీస్, అగ్నిమాపక, మున్సిపల్, గ్రామ పంచాయతీ, విద్యుత్, రెవెన్యూ శాఖల ప్రక్రియలను ఒకే డిజిటల్ వేదికపైకి తీసుకొచ్చినట్లు ఎస్పీ తెలిపారు.

**ఉచితంగానే దరఖాస్తు..**

ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడం, స్థల పరిశీలన, నిరభ్యంతర పత్రం పొందడం పూర్తిగా ఉచితమని స్పష్టం చేశారు. ఇందుకోసం ఎలాంటి రుసుము లేదా చలానా చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు సంబంధిత వెబ్‌సైట్‌లోకి వెళ్లి కొత్త దరఖాస్తు ఎంపికను ఎంచుకుని మొబైల్ నంబర్, సంకేత సంఖ్య ధ్రువీకరణ అనంతరం కమిటీ సభ్యుల వివరాలు, మండపం ఏర్పాటు చేసే స్థలం, విగ్రహం ఎత్తు, ఉత్సవాల తేదీలు, నిమజ్జనం మార్గం తదితర వివరాలను నమోదు చేయాలని సూచించారు.

**స్థల పరిశీలన అనంతరం అనుమతి**

దరఖాస్తు సమర్పించిన అనంతరం సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో కూడిన వివిధ శాఖల బృందం మండపం ఏర్పాటు చేసే ప్రదేశాన్ని పరిశీలిస్తుంది. భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఏర్పాట్లు ఉన్నట్లయితే అనుమతి మంజూరు చేస్తారు. నిరభ్యంతర పత్రానికి సంకేత చిత్రంతో కూడిన డిజిటల్ ప్రతిని అందిస్తారు. దానిని ముద్రించి లామినేషన్ చేయించి మండపంలో స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు.

**భద్రతా నిబంధనలు పాటించాలి**

మండపాలు రహదారులపై రాకపోకలకు, వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగించకుండా ఏర్పాటు చేయాలని ఎస్పీ సూచించారు. మండపాల వద్ద తప్పనిసరిగా నిఘా కెమెరాలు ఏర్పాటు చేయడంతో పాటు ఇసుక బకెట్లు, నీటి డ్రమ్ములు వంటి అగ్నిమాపక పరికరాలను అందుబాటులో ఉంచాలన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి విగ్రహాలను ప్రోత్సహించాలని కోరారు.నిమజ్జనం, ఊరేగింపు సమయంలో ధ్వని పరికరాలను నిబంధనలకు లోబడి వినియోగించాలని, శబ్ద కాలుష్యానికి కారణమయ్యే డీజేలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సార్వజనిక ప్రదేశాల్లో మండపాలు ఏర్పాటు చేసే కమిటీలన్నీ తప్పనిసరిగా ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా నిరభ్యంతర పత్రం పొందాలని సూచించారు. అనుమతి లేకుండా మండపాలు ఏర్పాటు చేస్తే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అత్యవసర పరిస్థితులు లేదా సమస్యలు ఎదురైనప్పుడు 100, 112కు లేదా సమీప పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని జిల్లా ఎస్పీ పి.జగదీష్ ఐపీఎస్ ప్రజలకు సూచించారు.

## నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణపై మంత్రివర్గ ఉపసంఘం భేటీ...!

- ధరలపై నిరంతర పర్యవేక్షణకు నిర్ణయం
- సరఫరా వ్యవస్థ బలోపేతంపై చర్చ
- ఉపసంఘం భేటీలో పాల్గొన్న ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్



**అమరావతి - సూర్య వాస్తవం :** రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరల పరిస్థితి, ధరల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై అమరావతి సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో రానున్న రోజుల్లో నిత్యావసర వస్తువుల ధరలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని సమావేశంలో చర్చించారు. అదే విధంగా మార్కెట్‌లో సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయడం, కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం, ప్రజలకు నిత్యావసర వస్తువులు అందుబాటు ధరల్లో నిరంతరంగా లభించేలా చర్యలు చేపట్టడంపై మంత్రులు, అధికారులు కీలకంగా చర్చించారు. ధరల పెరుగుదలతో సామాన్య ప్రజలపై భారం పడకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించినట్లు తెలిపారు.

## సెప్టెంబర్ 5న ఆర్ట్స్ కళాశాలలో గురుపూజోత్సవం...!

- ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను ఆహ్వానించిన డీఈవో అయూబ్ హుస్సేన్



**అనంతపురం విద్య - సూర్య వాస్తవం :** అనంతపురం నగరంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) అయూబ్ హుస్సేన్ అనంత పురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. సెప్టెంబర్ 5వ తేదీన అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కాలేజీలో నిర్వహించనున్న గురు పూజోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్‌ను డీఈఓ అయూబ్ హుస్సేన్ ఆహ్వానించారు. గురువులను సత్కరించి, వారి సేవలను గౌరవించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ఉపాధ్యా యులను అభినందించాలని కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లపై కూడా చర్చించినట్లు తెలిపారు.

## గడ్డి విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ ఆనంద్



**గుత్తి - సూర్య వాస్తవం :** గుత్తి మండలం శ్రీపురం గ్రామంలో పశువులకు పశు గ్రాసం కొరత లేకుం డా చూడాలనే ఉద్దేశంతో జిల్లా యం త్రాంగం కీలక చర్యలు చేపట్టింది.జి ల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పశుగ్రాసం కోసం 25 ఎకరాల విస్తీర్ణంలో గడ్డి వి త్తనాలను ట్రాక్టర్ ద్వారా విత్తే కార్య క్రమాన్ని ప్రారంభించారు.ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.పశు పోషకులు పశుగ్రాసం కోసం ఇబ్బం దులు పడకుండా ముందస్తు చర్య లు తీసుకుంటున్నామని తెలిపారు. రైతులు,పశుపోషకులు గడ్డి సాగు ను ప్రోత్సహించుకోవాలని సూచిం చారు.25 ఎకరాల్లో గడ్డి విత్తనాలు సాగు చేయడం ద్వారా పశువులకు అవసరమైన పచ్చిమేత అందుబా టులోకి రావడంతో పాటు పశుపోష కులకు ఆర్థిక భారం తగ్గుతుందని అధికారులు తెలిపారు.పశు సంపద ను కాపాడుకోవడంతో పాటు రైతు ల ఆదాయాన్ని పెంచే దిశగా ఇలాం టి కార్యక్రమాలు మరింత విస్తృతం గా చేపట్టాలని జిల్లా యంత్రాంగం ల క్ష్యంగా పెట్టుకుంది.పశువులకుపచ్చి మేత. రైతులకు ఆర్థిక భరోసా అనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం పశుపోషకులకు ఎంతో ఉపయోగక రంగా ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రామలింగమయ్య మరియు అగ్రికల్చర్ సిబ్బంది అలాగే ఎమ్మార్వో వీఆర్వోలు, ఆశ వర్కర్లు గ్రామ సిబ్బంది, గ్రామా ప్రజలు పాల్గొన్నారు.

# నూతన ఆసుపత్రికి భూమిపూజ...!

- అర్బన్‌లో రూ.1,296 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు: ఎమ్మెల్యే
- నీటి సమస్యపై ముందస్తు ప్రణాళికతో ప్రభుత్వం చర్యలు: ఎంపీ
- రూ.42 లక్షలతో గ్రామీణ ఆరోగ్య కేంద్రం నిర్మాణం
- భూమి పూజలో ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ



**అనంతపురంప్రతినిధి - సూర్య వాస్తవం :** అనంతపురం అర్బన్ నియోజకవర్గంలోని నారాయణపురం గ్రామంలో నూతన గ్రామీణ ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ పథకం కింద రూ.42 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఈ ఆరోగ్య కేంద్రానికి అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ శంకు స్థాపన చేశారు. కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ నారాయణపురంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం శిథిలావస్థకు చేరడంతో వైద్యులు, సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వైద్య సేవల కోసం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఈ సమస్యకు పరిష్కారం చూపే దిశగా నూతన ఆరోగ్య కేంద్రం నిర్మాణాన్ని చేపట్టామని చెప్పారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ కృషితో ఆసుపత్రి నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, త్వరలోనే నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో సుమారు 80 వేల ఇళ్లను సందర్శించినట్లు చెప్పారు. స్త్రీ శక్తి, తల్లికి వందనం, పింఛన్ల పెంపు, మెగా డీఎస్సీ తదితర కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేసిందన్నారు. ఇప్పటివరకు అర్బన్ నియోజకవర్గంలో రూ.1,296 కోట్లతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని, రూ.250 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు తదితర మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకున్నామని వివరించారు. త్వరలో మరో రూ.160 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు.
ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అనంతపురం జిల్లాపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించి పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారని అన్నారు. ఎల్‌నినో ప్రభావంతో నీటి సమస్య తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో నీటిని సద్వినియోగం చేసుకునేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తాగునీటిని ముందుగానే తగినంతగా నిల్వ చేసుకునే చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి, మిర్చి వంటి అధిక నీటి అవసరమయ్యే పంటల సాగుపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటి సంరక్షణలో ప్రజలంతా ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.
అనంతపురం అర్బన్ నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారని ఎంపీ ప్రశంసించారు. నారాయణ పురంలో నూతన ఆసుపత్రి నిర్మాణంతో స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈఈ కె.లక్ష్మీనారాయణ, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# రాయలసీమ నీటి హక్కులను తాకట్టు పెట్టొద్దు...!

- చంద్రబాబు రేవంత్‌రెడ్డికి ఇచ్చిన మాటలో భాగంగానే రామానాయుడు వ్యాఖ్యలు: వైసీపీ
- శ్రీశైలం జలాలను నాగార్జునసాగర్‌కు తరలించడం రాయలసీమకు వెన్నుపోటు
- నీటి హక్కులపై అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరి ప్రకటించాలి: కె.వి.రమణ



**అనంతపురం - సూర్య వాస్తవం :** తెలంగాణ ఎడమగట్టు విద్యుత్ ఉత్పత్తి ద్వారా నాగార్జున సాగర్‌కు చేరే నీటిని ఆంధ్రప్రదేశ్ కూడా వినియోగిస్తుందని ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు చేసిన వ్యాఖ్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఇచ్చిన మాటలో భాగంగానే ఉన్నాయని వైఎస్సార్‌సీపీ రాయలసీమ జోనల్ అధికార ప్రతినిధి కె.వి. రమణ ఆరోపించారు.తెలంగాణ అసెంబ్లీలో రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చంద్రబాబు ఆపివేయడం వెనుక రాజకీయ ఒప్పందం ఉందని వైఎస్సార్‌సీపీ అప్పట్లోనే చెప్పిందన్నారు. రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నిలిపివేయడం ఒక ద్రోహమైతే, తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం నీటిని దిగువకు తరలించడం రాయలసీమకు మరో అన్యాయమని విమర్శించారు. శ్రీశైలం జలాశయం నుంచి నీటిని నాగార్జునసాగర్‌కు తరలించడం వల్ల రాయలసీమతో పాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల నీటి హక్కులకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందని రమణ పేర్కొన్నారు. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలు తమ వైఖరిని స్పష్టంగా ప్రకటించి, రాయలసీమ ప్రయోజనాల కోసం పోరాడాలని కోరారు.నీటి హక్కుల విషయంలో రాజకీయ పార్టీలు మౌనం వహిస్తే దానిని కూడా ఒక వైఖరిగానే రాయలసీమ ప్రజలు పరిగణించాల్సి వస్తుందని అన్నారు. రామానాయుడు చేసిన వ్యాఖ్యలపై ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని, రాయలసీమ ప్రయోజనాలకు నష్టం కలిగించే చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఎడమగట్టు విద్యుత్ ఉత్పత్తి కోసం నీటిని నాగార్జునసాగర్‌కు తరలించే చర్యలను నిలిపివేసి, ఆ నీటిని రాయలసీమ అవసరాలకు వినియోగించాలని వైఎస్సార్‌సీపీ డిమాండ్ చేస్తోందన్నారు. ప్రభుత్వం ఇదే విధానాన్ని కొనసాగిస్తే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాయలసీమ ప్రాజెక్టుల కోసం ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేస్తామని కె.వి. రమణ హెచ్చరించారు.

# ఉద్యోగులకు న్యాయం చేయాలి...ఆర్ఎస్ దివాకర్‌రావు...!

- 12వ పీఆర్సీ ప్రక్రియను వేగవంతం చేయాలి
- 30 శాతం ఐఆర్ ప్రకటించాలి
- పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్






**అనంతపురం కలెక్టరేట్ - సూర్య వాస్తవం :** ఏపీ జేఏసీ అమరావతి జిల్లా అధ్యక్షులు ఆర్ఎస్ దివాకర్‌రావు అధ్యక్షతన గురు వారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల సమస్యలపై సిబ్బంది సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పట్ల అనుసరిస్తున్న తీరుపై దివాకర్‌రావు విపులంగా వివరించారు. ఉద్యోగుల వేతనాలను ప్రస్తుత జీవన వ్యయానికి అనుగుణంగా సవరించేందుకు పే రివిజన్ కమిషన్ (పీఆర్సీ) కమిషనర్‌ను నియమించకుండా గత రెండేళ్లుగా ప్రభుత్వం జాప్యం చేస్తోందని ఆయన అన్నారు. తక్షణమే పీఆర్సీ కమిషనర్‌ను నియమించి 12వ పీఆర్సీ ప్రక్రియను వేగవంతం చేసి ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.అలాగే ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ (ఇంటీరియం రిలీఫ్) ప్రకటించాలని కోరారు. పెరుగుతున్న ధరలు, జీవన వ్యయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉద్యోగులకు రావాల్సిన ఐదు పెండింగ్ డీఏలను వెంటనే ప్రకటించి, బకాయి మొత్తాలను తక్షణమే చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీఏ బకాయిల రూపంలో ప్రతి ఉద్యోగికి లక్షలాది రూపాయలు రావాల్సి ఉందని తెలిపారు.ఈ సమావేశంలో అసిస్టెంట్ జిల్లా మలేరియా అధికారి టి. వెంకటేశ్వర్లు, సబ్‌యూనిట్ అధికారులు బత్తుల కోదండరాంరెడ్డి, తిరుపాలయ్య, సెమివుల్లా, ఎస్. ప్రభాకర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ అధికారి బలరాంరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్లు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు

## నేడు అనఘాష్టిమి వ్రతంలో పాల్గొని స్వామికృపకు పాత్రులు గాండి

**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి పట్టణంలోని శ్రీఅనఘా ఆత్రేయ దత్త పాలుకా క్షేత్రంలో నేడు శు క్రవారం అనఘాష్టమి వ్రతం నిర్వహిస్తున్నందున యావ న్మంది భక్తాదులు పాల్గొని స్వామివారి కృపకు వార్తలు కావాలని శ్రీగురుదత్త సేవా సమితి పిలుపునిచ్చారు. శ్రావణ శుక్రవారం కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా అన ఘాష్టిమి వ్రతం వైభవంగా నిర్వహిస్తున్నామని, ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 12:30 వరకు వ్రతం నిర్వహిస్తున్నట్లు అనంతరం మహా మంగళహారతి, అనఘా వ్రత ప్రత్యేక తోరణం(రక్ష) వితరణ, తదుపరి అన్నదాన కార్యక్రమాలు నిర్వహించబడును అని సమితి కమిటీ నాయకులు పేర్కొన్నారు. కీర్తిశేషులు జ్ఞానమూర్తి ధర్మపత్ని సీతమ్మ, వారి కుటుంబ సభ్యులు, కీర్తిశేషులు బండ్లపల్లి రఘునాథ్ రెడ్డి ధర్మపత్ని రేవతి (భారతి) వారి కుటుంబ సభ్యులు ఈ కార్యక్రమానికి సేవాకర్తలుగా ఉందురని, అలాగే ఎం.హెచ్ లక్ష్మీనారాయణ రెడ్డి, సుకన్య వారి కుటుంబ సభ్యులు అన్నదాన సేవా కర్తలుగా నిర్వహిస్తున్నారని వారు తెలిపారు. శ్రీ దత్త భక్తులందరూ నిష్టాగరిష్టులై భక్తిశ్రద్ధలతో పాల్గొని అనఘాతోరం (రక్ష)ను ధరించి పరమ పూజ్య గురుదేవుల దివ్యానుగ్రహం పొంది సర్వ ఆపదలను తొలగించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు

# రెవెన్యూ సిబ్బంది మాయాజాలం
# పిఓబి భూమిని దొడ్డి దారి రిజిస్ట్రేషన్

- నెలబల్లి లో రెవెన్యూ అధికారుల హస్తంతో భూ కుంభకోణం
-స్థానికేతరునికే 40 అంకణాల స్థలాన్ని హక్కు కల్పించిన రెవెన్యూ అధికారులు
-సరాసరి 40 అంకణాల 22ఏ నిషేధిత జాబితాలో - ఉన్న స్థలానికి సర్వే నంబర్ 168-2 ఉన్నట్టుగా రిజిస్ట్రేషన్ చేయించిన వైనం
-భూ మాయాజాలంలో వీఆర్వో సర్వేయర్ తహశీల్దార్, వీఆర్ఏ కను సన్నల్లో రిజిస్ట్రేషన్ జరిగినట్లు స్థానికుల ద్వారా సమాచారం
-సర్వే స్కెచ్ కాపీలో సర్వేయర్ సంతకం నాది కాదు ఫోర్జరీ అంటున్న సర్వేయర్







**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** జాతీయ రహదారుల సమీపంలోని భూముల విలువ భారీగా పెరగడంతో అక్రమార్కులు రెవెన్యూ అధికారుల సహకారంతోప్రభుత్వ భూములను సైతం,సర్వే నంబర్లు మార్చి పట్టా భూములుగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు.భూ కుంభకోణాల్లో రెవెన్యూ అధికారుల ప్రధాన పాత్ర ఉన్నట్లుగా తెలుస్తోంది.ఇందుకు నిదర్శనంగానే దొంవారిసత్రం మండల పరిధిలోని నెలబల్లి రెవెన్యూ గ్రామంలో జాతీయ రహదారి సమీపాన స్థానిక వీఆర్వో, వీఆర్ఏ అండదండలతో భూ కుంభకోణం గత ఏడాది క్రితం జరిగినట్లు పలు ఆధారాలు లభ్యమయ్యాయి.స్వర్ణ సచివాలయానికి సమీపంలోనే సర్వే నంబర్ 7లో సుమారు 40 అంకణాలు 22ఎ నిషేధిత భూజాబితాలో ఉంది. ఆ స్థలాన్ని ఆ గ్రామ పనికి సంబంధం లేని ఓ వ్యక్తి సెప్టెంబర్2025న విధుల్లో ఉన్న వీఆర్వో,వీఆర్ఏ సహకారంతో ఆ నిషేధిత కాళీ భూమిని సంబంధంలేని సర్వే నంబర్ 168-2 గ్రామనతం భూమిలో ఉన్నట్లు సర్వే నంబర్ ని తారుమారు చేశారు.అప్పటి వీఆర్వో ప్రొసీడింగ్స్ సర్టిఫికెట్ జారీ చేశారు.రెవెన్యూ వెబ్ ల్యాండ్ లో కూడా మీ భూమి పోర్టల్ లో 168-2 సర్వే నంబర్ చూపించారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి గ్రామనట్టం భూమికి వెసులుబాటు కల్పించడంతో స్థానికేతరుడైన ఓ వ్యక్తి వీఆర్వో ప్రొసీడింగ్ తోపాటు,మండల సర్వే స్థలం మ్యాప్ స్కెచ్ సర్టిఫికెట్ కూడా పొంది.వాటి ఆధారాలతో నిషేధిత జాబితాలో ఉన్న స్థలాన్ని నాయుడుపేట రిజిస్ట్రేషన్ కార్యాలయంలో 12-9-2025 రిజిస్ట్రేషన్ మరో వ్యక్తిపై చేయించారు.అదే 40 అంకణాలు స్థలాన్ని నాయుడుపేట కు చెందిన ఓ చికెన్ వ్యాపారికి సుమారు 40 లక్షలకు అమ్మి సొమ్ము చేసుకున్నట్లు సమాచారం.ఈ అవినీతి అక్రమ భూ రిజిస్ట్రేషన్ వ్యవహారంలో సహాయ సహకారులుగా వీఆర్వో, వీఆర్ఏ ప్రధాన పాత్ర పోషించినట్లు అభియోగాలు ఉన్నాయి.ఇదిలా ఉండగా కాళీ స్థలం స్కెచ్ మ్యాప్ లో మండల సర్వేయర్ సంతకం నాది కాదని,ఎవరో నా సంతకాన్ని ఫోర్జరీ చేశారని వివరణ ఇస్తున్నారు.

ఏది ఏమైనా రాజు తలచుకుంటే కొరడా దెబ్బలకు కొదువ లేదన్నట్లు సామెతగా, ఆశించినది చేతికి అందిస్తే ప్రభుత్వ స్థలాలు సైతం,ప్రైవేటు భూములుగా మార్చే స్థితిలో రెవెన్యూ అధికారుల పనితీరు ఏమిటన్నది ఇలాంటి సంఘటనలలో తేటతెల్లనవుతోంది. జాతీయ రహదారి సమీపంలోని నెలబల్లిలో జరిగిన అక్రమ రిజిస్ట్రేషన్ లో మరెందరి అధికారుల హస్తం ఉందో ఉన్నత స్థాయి అధికారుల విచారణలో అసలు కారకులెవరన్నది బట్ట బయలు కానుంది.సంబంధిత జిల్లా కలెక్టర్,ఆర్డీవో గత ఏడాది జరిగిన భూ కుంభకోణంలో అసలు సూత్రధారులు ఎవరన్నది గుర్తించి తగు చర్యలు చేపట్టాలని ఆ గ్రామ ప్రజలు అంటున్నారు.

## 108 ఈఎంటి సమయస్ఫూర్తితో తల్లికి సుఖ ప్రసవం- బిడ్డ క్షేమం



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** దొరవారిసత్రం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న 108 వాహన సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించి తల్లికి సుఖ ప్రసవం చేసి-బిడ్డను తల్లికి అందించారు.వివరాలు చూస్తే మండల పరిధిలోని పులికాట్ తీర ప్రాంత గ్రామమైన కారికాడు గ్రామం నుండి సెప్టెంబర్ 2 అర్ధరాత్రి పురిటి నొప్పులతో అవస్థ పడుతుందని 108 వాహనానికి కాల్ చేశారు వాహనం వెళ్లి గర్భిణీ స్త్రీని ఆ గ్రామంలో నుండి సూళ్లూరుపేటకు తరలించే సమయంలో ప్రసవ వేదన నొప్పులు అధికం కావడంతోఈఎంటి మురళి కాల్ సెంటర్ లోని డాక్టర్ సలహాలు అనుసరిస్తూ సమయ పూర్తిగా వ్యవహరించి తల్లికి కాన్పు చేశారు సుఖ ప్రసవం అయిన బిడ్డను తల్లి చెంతకు చేర్చారు.అనంతరం డాక్టర్ పరిశీలన నిమిత్తం సూళ్లూరుపేట సిహెచ్ సి లో అడ్మిషన్ చేశారు.కొంత అవగాహన ఉండి,సమయ పూర్తితో వ్యవహరించి డాక్టర్ సలహా పాటిస్తే కొన్ని సమస్యలను పరిష్కరించవచ్చనే నిరూపించారు. మార్గమధ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తల్లికి సుఖ ప్రసవంచేసినందుకు 108 సిబ్బంది ఈఎంటి మురళి కి సహకరించిన అంకయ్యకు వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.108 వాహనం నిరుపేదలకు ఎన్నో విధాలుగా ఉపయోగపడుతుందనే ఈ సంఘటన ఓ నిదర్శనంగా ఉంది.

## సేవా కార్యక్రమాలు చేపడుతున్న భూలక్ష్మి సేవా సమితి



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:**సాటి మనిషికి సాయం చేయడం,ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం,మానవత్వంతో పేదల అవసరాలు తీర్చడం కొందరి గుణం,అదే బాటలో నాయుడుపేట మండల పరిసరాల్లో గత కొన్ని నెలలుగా భూలక్ష్మి సేవా సమితి ఆపన్న హస్తం అందిస్తూ గిరిజనుల అవసరాలను ఆదుకుంటూ సేవా కార్యక్రమాలను చేపడుతోంది.గురువారం ఆ సంస్థ ప్రతినిధిగా టిడిపి లీగల్ సెల్ అడ్వకేట్ పనబాక గంగరాజు శ్రీనివాసపురం,బట్టి విడత గిరిజన కాలనీలో ఒంటి పో లయ్య, సుబ్బ రత్నమ్మ కుమార్తె వివాహానికి అవసరమైన బియ్యం కూరగాయలు,సరుకులు అందజేశారు.ఆ కాలనీలో ఎవరైనా మృతి చెందిన,వివాహాది శుభ కార్యాలయం వారికి అవసరమైన ఆర్థిక సాయం కూడా అందిస్తూ అండగా నిలవడంతో సంస్థ నిర్వాహకులను గిరిజనులు అభినందనలు తెలియజేస్తున్నాను.

## వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా జరగాలి
### ... డీఎస్పీ చెంచుబాబు



**దొరవారిసత్రం - సూర్య వాస్తవం:** పల్లెల్లో నిర్వహించే వినాయక చవితి ఉత్సవాలు శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో మాత్రమే సాగాలని డీఎస్పీ చెంచు బాబు సూచించారు. దొరవారిసత్రం మండల పరిధిలోని 22 గ్రామపంచాయతీల్లో వినాయక చవితి పండుగ సందర్భంగా ఏర్పాటు చేయనున్న గణేష్ విగ్రహాల.ఏర్పాటుకు అను మతులు తప్పనిసరి అని అన్నారు.ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ,శాంతి భద్రతలకు భంగం కలిగించే పరిస్థితులు ఏర్పడితే ఆ గ్రామ కమిటీ బాధ్యత వహించాల్సి ఉంటుందని ముందుగానే తెలియజేశారు.విద్యుత్ ప్రమాదాలు,మద్యం సేవించి అల్లరి చిల్లర చేష్టలు ఎక్కడ జరగకూడదని హెచ్చరించారు.ప్రధానంగా వృద్ధులకు,పిల్లలకు ఆరోగ్యపరంగా శబ్ద కాలుష్యం లేకుండా,సౌండ్ సిస్టమ్స్ లు పరిమితి స్థాయిలోనే సద్వినియోగం చేసుకోవాలని,తెలియజేశారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందుగానే వినాయక చవితి విగ్రహ కమిటీలు బాధ్యత తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ సంగమేశ్వర రావు,ఎస్సై జివి నాయుడు,పలు గ్రామాల విగ్రహ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్

-ట్రాఫిక్ నిబంధనల అమలు,రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి
- జిల్లా వ్యాప్తంగా ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో విస్తృతంగా విజిబుల్ పోలీసింగ్
- ట్రాఫిక్ రాకపోకలను క్రమబద్ధీకరించేందుకు ప్రత్యేక చర్యలు.
- హెల్మెట్,సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక తనిఖీలు
- ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై చట్టపరమైన చర్యలు.
- రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులకు అవగాహన



**దొరవారిసత్రం- సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు,ఆదేశాల మేరకు గురువారం సాయంత్రం జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు



విజిబుల్ పోలీసింగ్ మరియు ట్రాఫిక్ నియంత్రణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా ప్రధాన కూడళ్లు,రద్దీ ప్రాంతాలు, ముఖ్య రహదారులపై పోలీసు అధికారులు మరియు సిబ్బంది విస్తృతంగా విధులు నిర్వహిస్తూ ట్రాఫిక్ రాకపోకలను క్రమబద్ధీకరించారు.ఈ సందర్భంగా వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తున్నారా లేదా అనే అంశంపై ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించారు.ముఖ్యంగా హెల్మెట్,సీట్‌బెల్ట్ వినియోగం, ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగం, వాహనాల క్రమబద్ధమైన రాకపోకలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై నిబంధనల మేరకు చట్టపరమైన చర్యలు చేపట్టడంతో పాటు,రోడ్డు ప్రమాదాల నివారణకు పాటించాల్సిన భద్రతా చర్యలపై వాహన దారులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, మాట్లాడుతూ, రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. అదేవిధంగా, వాహనం నడిపే సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం, అతివేగం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిస్తూ,రోడ్డు ప్రమాదాల నివారణ,ట్రాఫిక్ నియంత్రణ మరియు నిబంధనల సమర్థవంతమైన అమలులో భాగంగా జిల్లా వ్యాప్తంగా విజిబుల్ పోలీసింగ్ మరియు ప్రత్యేక తనిఖీలను నిరంతరం కొనసాగిస్తామని జిల్లా పోలీస్ శాఖ వెల్లడించారు.

## నాయుడుపేట నారాయణ హైస్కూల్ లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:** నాయుడుపేటలోని నారాయణ హైస్కూల్లో గురువారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి నారాయణ విద్యాసంస్థల ఏజీఎ మ్ నూర్ రియాజ్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలో ఆకట్టుకున్నారు. విద్యార్థులు ప్రదర్శించిన కృష్ణుడి బాల్యలీలలు,భక్తి గీతాలు, నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా నూర్ రియాజ్ మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు,నైతిక విలువలను విద్యార్థులు తెలుసు కోవ డంలో ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని తెలిపారు. శ్రీకృష్ణుడి జీవితంలోని ధర్మం,సత్యం,కర్తవ్యనిష్ఠ,ప్రేమ, మానవతా విలువలను విద్యార్థులు తమ జీవితంలో అలవర్చుకోవాలని సూచించారు.పాఠశాల ప్రిన్సిపాల్ పి.మల్లికార్జున మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెంపొందించేందుకు పాఠశాలలో ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు.





## జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడుని కలిసిన మంత్రి సత్య కుమార్ యాదవ్



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:**అమరావతి ఏపీ సచివాలయంలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుని కలిసి, చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీర్) నుంచి పీఏబీఆర్ కుడి కాలువ చివరి ప్రాంతానికి 1 టీఎంసీ వరద నీటిని ఎత్తిపోసే పథకాన్ని మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేసిన మంత్రి శ్రీ సత్య కుమార్ యాదవ్.ఈ పథకం ద్వారా బత్తలపల్లి,తాడిమర్రి మండలాల్లో తాగునీటి అవసరాలు తీరడంతో పాటు 45,800 ఎకరాలకు సాగునీటి ప్రయోజనం,48 చెరువులు,24 చెక్‌డ్యామ్‌లకు నీరు అందే అవకాశం ఉందని వివరించారు.కరువు ప్రభావిత ప్రాంతాల ప్రజల తాగు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, పథకానికి సూత్రప్రాయ ఆమోదం ఇచ్చి డీపీర్ సిద్ధం చేసి పనులను ప్రాధాన్యతా ప్రాతిపదికన చేపట్టాలని మంత్రి నిమ్మల రామానాయుడిని మంత్రి సత్య కుమార్ యాదవ్ కోరారు.



## నా రిటైర్మెంట్ దగ్గరపడిందేమో అని కుటుంబ సభ్యులతో చెప్పాను: తాప్సీ

ప్రముఖ కథానాయిక తాప్సీ కొంత కాలంగా పూర్తిగా బాలీవుడ్ పైనే దృష్టి సారించిన సంగతి తెలిసిందే. తాప్సీ ప్రధాన పాత్రలో నటించిన సస్పెన్స్ యాక్షన్ థ్రిల్లర్ 'గాంధారి' ఈరోజు నుంచి ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది. దేవాశిష్ మఖీజా దర్శకత్వంలో, కనికా థిల్లాన్ నిర్మించిన ఈ చిత్రంలో ప్రమాదకర పరిస్థితులను ఎదుర్కొంటూ తన బిడ్డ కోసం పోరాడే పవర్‌ఫుల్ తల్లి పాత్రలో తాప్సీ కనిపించారు. ఇష్వాక్ సింగ్, జతిన్ సర్నా, స్వస్తికా ముఖర్జీ ముఖ్య పాత్రలు పోషించిన ఈ చిత్రం విడుదలై మంచి స్పందన పొందుతున్న తరుణంలో... తాప్సీ ఇండస్ట్రీ ధోరణిపై చేసిన కొన్ని సంచలన వ్యాఖ్యలు నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న తాప్సీ... ప్రస్తుతం సినీ ఇండస్ట్రీలో వస్తున్న కొన్ని రకాల సినిమాలు, మార్కెట్ ధోరణిలను చూస్తుంటే తనకు నటనకు స్వస్తి చెప్పాలనే ఆలోచన వచ్చిందని సంచలన వ్యాఖ్యలు చేశారు. కథల ఎంపికలో నాణ్యత, ప్రమాణాలు తగ్గించుకుని సినిమాలు చేయాల్సిన పరిస్థితి వస్తే, నటించడం మానేసి ప్రశాంతంగా రిటైర్ అవ్వడమే తనకు ఇష్టమని తేల్చి చెప్పారు. గత కొన్ని నెలలుగా థియేటర్లలోకి వస్తున్న చిత్రాల తీరును గమనించి, "నా రిటైర్మెంట్ సమయం దగ్గరపడిందేమో" అని తన కుటుంబ సభ్యులతో కూడా సరదాగా వ్యాఖ్యానించినట్లు తెలిపారు. తనకు నటనపై ఎంతో ప్రేమ ఉన్నప్పటికీ, ఎలాంటి స్క్రిప్ట్‌నైనా ఓకే చేసేంత గుడ్డి ప్రేమ మాత్రం కాదని తాప్సీ స్పష్టం చేశారు. మార్కెట్ ట్రెండ్స్ మారుతుంటాయని, కానీ మనం చేసే సినిమాలు చరిత్రగా మిగిలిపోతాయని చెప్పారు. పదేళ్ల తర్వాత తన ఫిల్మోగ్రఫీని తిరిగి చూసుకుంటే తనకైనా, తన అభిమానులకైనా సిగ్గుచేటుగా అనిపించ కూడదనేది తన తాపత్రయమని వెల్లడించారు. కష్టపడి సంపాదించుకున్న గుర్తింపును కాపాడుకునేందుకు, తన ప్రమాణాలకు తగిన కథలనే ఎంచుకుంటానని ఆమె స్పష్టం చేశారు.

# 'యేషనాగుల' దుమ్మురేపుతోంది.. యూట్యూబ్‌లో అదిరిపోయే రికార్డు!




యూట్యూబ్ గ్లోబల్ చార్టుల్లో నంబర్ వన్ ట్రెండింగ్
సోషల్ మీడియాలోనూ పాటకు భారీ స్పందన
పాటలో కనిపించిన నాని, కీర్తి సురేశ్

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'ది ప్యారడైజ్' సినిమాపై అంచనాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలోని రెండో పాట 'యేషనాగుల' మరో సంచలనం సృష్టించింది. విడుదలైన ఐదు రోజుల్లోనే 50 మిలియన్లకు పైగా వ్యూస్ సాధించిన తొలి తెలుగు పాటగా రికార్డు సృష్టించిందని చిత్రబృందం ప్రకటించింది. 'యేషనాగుల' పాట ఆగస్టు 29న విడుదలైంది. తెలంగాణ జానపద బాణీకి ఆధునిక టచ్ జోడించిన ఈ పాటకు మంచి స్పందన వస్తోంది. పాట విడుదలైన కొద్దిరోజుల్లోనే యూట్యూబ్‌తో పాటు సోషల్ మీడియాలోనూ ట్రెండ్‌గా మారింది. నాని, కీర్తి సురేశ్ కనిపించే ఈ పాటకు అభిమానులు భారీగా స్పందిస్తున్నారు. గ్లోబల్ చార్టుల్లోనూ దూకుడు 'యేషనాగుల' యూట్యూబ్ గ్లోబల్ చార్టుల్లో నంబర్ వన్ ట్రెండింగ్‌లో ఉందని 'ది ప్యారడైజ్' అధికారిక ఖాతా వెల్లడించింది. ఐదు రోజుల్లో 50 మిలియన్ల మార్క్‌ను దాటడం విశేషంగా మారింది. సోషల్ మీడియాలో ఈ పాటకు సంబంధించిన రీల్స్, డ్యాన్స్ వీడియోలు కూడా వైరల్ అవుతున్నాయి. పాటకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం రాశారు. ప్రభా బంగారిగల్ల, అడ్డుల జంగిరెడ్డి పాడారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో రూపొందుతున్న 'ది ప్యారడైజ్'లో నాని కీలక పాత్రలో నటిస్తున్నారు. ఈ పాట విడుదల సమయంలో అనిరుధ్ రవిచందర్ డల్లాస్ కచేరీలో నాని వేదికపైకి వచ్చి సందడి చేయడం కూడా అభిమానుల్లో ఆసక్తిని పెంచింది.



## నా డాక్టర్ చదువు.. నటిగా నాలో పరిణతిని తెచ్చింది!

యువ కథానాయకి ప్రస్తుతం బాలీవుడ్‌లో ప్రముఖ దర్శకుడు అనురాగ్ బసు తెరకెక్కిస్తున్న ఓ రొమాంటిక్ మ్యూజికల్ లవ్‌స్టోరీలో హీరోయిన్‌గా నటిస్తోంది. యంగ్ హీరో కార్తీక్ ఆర్యన్ కథానాయకుడిగా నటిస్తున్న ఈ సినిమాతోనే హిందీలోకి అడుగుపెడుతోందీ భామ. అటు తమిళంలో స్టార్ హీరో ధనుష్, డైరెక్టర్ రాజ్‌కుమార్ పెరియసామి కాంబోలో రానున్న 'ఓమ్' సినిమాలోనూ శ్రీలీలే హీరోయిన్. ఇలా వరుస షూటింగ్స్, బిజీ షెడ్యూ ల్స్ మధ్య ఉన్న శ్రీలీల తాజాగా ఓ ఇంటర్వ్యూలో తన వైద్య విద్య గురించి ఆసక్తికర విషయాలు పంచుకుంది. "నేను చేసిన వైద్య విద్య, హాస్పిటల్ పోస్టింగ్‌లో అనుభవాలు నటిగా నా ఆలోచనా వి ధానాన్ని ఎంతో తీర్చిదిద్దాయి. సినిమా రంగానికి అతీతంగా నిజ జీవితంలో నేను పొందిన అనుభవాలు వైవిధ్యమైన పా త్రలను అర్థం చేసుకోవడానికి ఎంతగానో తోడ్పడ్డాయి. ఆసుపత్రిలో పనిచేసే సమయంలో ప్రతిరోజూ పేషెంట్ల జీవితం, మర ణం, వారి కు టుంబాలు పడే ఆర్థిక ఇబ్బందులు, మానసిక పోరాటాలను కళ్లారా చూ శాను.



# ఆటగాళ్ల గాయాలకు చెక్.. బీసీసీఐ పకడ్బందీ ప్లాన్

**గాయాల నివారణకు ఎఫ్‌టీపీలో మార్పులు చేయనున్న బీసీసీఐ**
**ఆటగాళ్లకు తగిన విశ్రాంతి కల్పించడంపై దృష్టి**
**రిటర్న్ టు ప్లే నిబంధనలను బీసీసీఐ సమీక్ష**
**ఫిట్‌నెస్ సాధించిన తర్వాతే జాతీయ జట్టులోకి అనుమతి**
**సీఓఈలో 16 మంది ఫిట్‌నెస్, రిహాబ్ నిపుణులు**



భారత క్రికెటర్లను వెంటాడుతున్న గాయాల సమస్యపై బీసీసీఐ దృష్టి సారించింది. వరుసగా అంతర్జాతీయ మ్యాచ్‌లు, ఐపీఎల్ వంటి ఫ్రాంచైజీ టోర్నీలు ఆడాల్సి రావడం ఆటగాళ్లపై తీవ్ర ప్రభావం చూపుతోందని బోర్డు గుర్తించింది. ఈ సమస్యకు పరిష్కారం చూపేందుకు 'భవిష్యత్ పర్యటనల ప్రణాళిక' (ఎఫ్‌టీపీ)లో మార్పులు చేయాలని నిర్ణయించింది. ముంబైలో గురువారం జరిగిన సమీక్షా సమావేశం తర్వాత బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఈ విషయాన్ని వెల్లడించారు. టెస్టు, వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20 కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ సమావేశంలో పాల్గొన్నారు. ఆటగాళ్లకు తగిన విశ్రాంతి లభించేలా భవిష్యత్ షెడ్యూల్‌ను రూపొందించడంపై చర్చించారు. ఇంగ్లాండ్ పర్యటనకు ముందు ఆటగాళ్లు రెండు నెలల పాటు ఐపీఎల్‌లో ఆడారని సైకియా గుర్తుచేశారు. ఆ తర్వాత అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడటంతో పలువురు గాయపడ్డారని చెప్పారు. ఇకపై ఇలాంటి పరిస్థితులు రాకుండా ఎఫ్‌టీపీలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆటగాడు గాయం నుంచి కోలుకున్న తర్వాత తిరిగి జట్టులోకి రావడానికి ఉన్న నిబంధనలను కూడా సమీక్షించారు. సొంత ఫిజియో పర్యవేక్షణలో గానీ, బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)లో గానీ పునరావాసం పూర్తి చేయాల్సి ఉంటుంది. పూర్తి ఫిట్‌నెస్ సాధించిన తర్వాతే అంతర్జాతీయ క్రికెట్‌కు అనుమతిస్తారు. గాయాల విషయంలో వ్యక్తిగత ఆటగాళ్లపై ఎలాంటి చర్చ జరగలేదని సైకియా స్పష్టం చేశారు. ఆటగాళ్ల ఫిట్‌నెస్, పునరావాసానికి సంబంధించిన విధానాలపైనే సమావేశంలో చర్చ జరిగిందన్నారు. కెప్టెన్లు, కోచ్ నుంచి సలహాలు తీసుకుని కొత్త వ్యూహాన్ని సిద్ధం చేస్తున్నామని చెప్పారు. సీఓఈలో స్పోర్ట్స్ సైన్స్ విభాగం అధిపతి పదవి ఖాళీగా ఉన్నా కార్యకలాపాలకు ఇబ్బంది లేదన్నారు. ప్రస్తుతం 16 మంది నిపుణులు ఫిట్‌నెస్, రిహాబ్, ప్రీహాబ్ కార్యక్రమాలను చూస్తున్నారని తెలిపారు. అత్యున్నత అర్హతలు ఉన్న వ్యక్తి కోసం ప్రపంచవ్యాప్తంగా అన్వేషణ కొనసాగుతోందన్నారు. తదుపరి ఎఫ్‌టీపీలో కీలక మార్పులు చేయాలని బీసీసీఐ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చినట్లు సైకియా చెప్పారు. ముఖ్యంగా విదేశీ పర్యటనలకు ముందు ఆటగాళ్లకు విశ్రాంతితో పాటు అక్కడి పరిస్థితులకు అలవాటు పడేందుకు ప్రాక్టీస్ మ్యాచ్‌లు ఉండేలా షెడ్యూల్ రూపొందించనున్నట్లు తెలిపారు.



## చీఫ్ సెలెక్టర్ పదవికి అగార్కర్ గుడ్‌బై? బీసీసీఐ కీలక క్లారిటీ

టీమిండియా చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ పదవిపై వస్తున్న ఊహాగానాలకు బీసీసీఐ తెరదించింది. గురువారం జరిగిన కీలక సమీక్ష సమావేశానికి అగార్కర్ హాజరుకాక పోవడంతో.. ఆయన పదవీకాలంపై పలు రకాల వార్తలు వచ్చాయి. అయితే బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా ఈ ప్రచారాలను కొట్టిపారేశారు. ఈ సమావేశానికి టెస్టులు, వన్డేలకు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, టీ20లకు కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ హాజరయ్యారు. బీసీసీఐ ఉన్నతాధికారులతో పాటు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ క్రికెట్ డైరెక్టర్ వీవీఎస్ లక్ష్మణ్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. అయితే అగార్కర్ మాత్రం ప్రత్యక్షంగా గానీ, ఆన్‌లైన్‌లో గానీ సమావేశానికి హాజరు కాలేదు. దీంతో అగార్కర్ పదవీకాలం కొనసాగుతుందా? ఆయనకు పొడిగింపు ఇస్తారా? అన్న చర్చ మొదలైంది. దీనిపై సైకియా స్పష్టత ఇచ్చారు. అగార్కర్ నగరంలో లేరని చెప్పారు. సమావేశాన్ని చాలా తక్కువ వ్యవధిలో ఏర్పాటు చేయడంతో ఆయన హాజరు కాలేకపోయారని తెలిపారు. ఆన్‌లైన్‌లో పాల్గొనేందుకు ప్రయత్నించినా.. ఆయన ఉన్న ప్రాంతంలో అది సాధ్యం కాలేదన్నారు. అగార్కర్‌కు చీఫ్ సెలెక్టర్‌గా పొడిగింపు ఇవ్వడంపై సమావేశంలో ఎలాంటి చర్చ జరగలేదని సైకియా స్పష్టం చేశారు. అలాగే వీవీఎస్ లక్ష్మణ్‌ను బీసీసీఐ క్రికెట్ డైరెక్టర్‌గా నియమించే అంశంపైనా ఎలాంటి చర్చ జరగలేదని చెప్పారు. అగార్కర్ చీఫ్ సెలెక్టర్‌గా ఉన్న సమయంలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు తీవ్ర చర్చకు దారితీశాయి. టీ20 కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్‌కు దీర్ఘకాలిక మద్దతు ఇవ్వడం అందులో ఒకటి. హార్దిక్ పాండ్యాకు బదులుగా సూర్యకుమార్‌ను ఎంపిక చేయడంపై విమర్శలు వచ్చాయి. అలాగే విజయవంతమైన కెప్టెన్ రోహిత్ శర్మను వన్డే కెప్టెన్సీ నుంచి తప్పించడం కూడా సున్నితమైన నిర్ణయంగా మారింది. అయితే ఈ నిర్ణయాల విషయంలో అగార్కర్ వెనక్కి తగ్గలేదు.

## వీరపునాయునిపల్లెలో
# ఏపీ దళిత సమైఖ్య నూతన కమిటీ ఏర్పాటు

**వీరపునాయునిపల్లె – సూర్య వాస్తవం :** మండలంలో ఏపీ దళిత సమైఖ్య నూతన కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. కడప జిల్లా ఉపాధ్యక్షుడు రాములయ్య ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. దళితుల హక్కుల పరిరక్షణ, భూ సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం సాధన ప్రధాన లక్ష్యాలుగా కమిటీ పనిచేయాలని నిర్ణయించారు.ఈ కార్యక్రమంలో ఏపీ దళిత సమైఖ్య అధ్యక్షులు కొత్తపల్లి యల్లయ్య పాల్గొని నూతన కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. దళితుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి స్థాయిలో సంఘటితంగా పనిచేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా భూమి లేని దళితులకు భూమి సాధించడం, దళితుల భూ సమస్యలను పరిష్కరించడం, దళితులకు కేటాయించిన భూములను పరిరక్షించడం వంటి అంశాలపై బలమైన పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కమలాపురం నియోజకవర్గ అధ్యక్షులుగా నక్కా రమేష్‌ను ఎన్నుకున్నారు. వీరపునాయునిపల్లె మండల అధ్యక్షులుగా కాకర్ల మస్తానయ్య, ఉపాధ్యక్షులుగా కాకల నాగార్జునను ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు దళితుల సమస్యలను నిరంతరం ప్రజల ముందుకు తీసుకెళ్లడంతో పాటు, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించే వరకు కృషి చేస్తామని తెలిపారు.ఏపీ దళిత సమైఖ్య ప్రధాన లక్ష్యాల్లో భూ పోరాటం, దళితుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సామాజిక సమానత్వం కీలక అంశాలని నాయకులు స్పష్టం చేశారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందేలా కృషి చేయాలని నిర్ణయించారు. గ్రామస్థాయిలో దళిత కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిపై సమిష్టిగా పోరాడేలా మండల కమిటీ పనిచేయాలని సూచించారు.రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పిట హరిబాబు మాట్లాడుతూ దళితుల సమస్యలను పరిష్కరించడంలో సంఘటిత శక్తి అత్యంత కీలకమని అన్నారు. దళితుల హక్కులకు భంగం కలిగిన ప్రతి



సందర్భంలో ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటం చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. దళితుల భూ హక్కుల కోసం జరిగే పోరాటాలను మరింత బలోపేతం చేయాలని అన్నారు.రాయలసీమ కోఆర్డినేటర్ మిద్దె వెంకటరమణ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి రాయలసీమ స్థాయి వరకు ఏపీ దళిత సమైఖ్యను మరింత బలోపేతం చేస్తామని తెలిపారు. దళితుల సమస్యలను ఒక ప్రాంతానికే పరిమితం చేయకుండా, వాటిని సమిష్టి ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షులు చెంచుగార్ల నాగార్జున మాట్లాడుతూ నూతన కమిటీ ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కారం కోసం కృషి చేయాలని సూచించారు. దళితుల సమస్యలపై అవసరమైనప్పుడు ఐక్యంగా ఉద్యమించేందుకు కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఏపీ దళిత సమైఖ్య మీడియా ప్రతినిధి అశోక్ మాట్లాడుతూ దళితుల సమస్యలను ప్రజల దృష్టికి తీసుకెళ్లడంలో మీడియా విభాగం తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తుందని తెలిపారు. దళితుల సమస్యలు, భూ పోరాటాలు, హక్కుల పరిరక్షణకు సంబంధించిన అంశాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన కమిటీ ఏర్పాటుతో వీరపునాయునిపల్లె మండలంలో ఏపీ దళిత సమైఖ్య కార్యకలాపాలు మరింత విస్తృతం కానున్నాయని నాయకులు తెలిపారు. దళితుల భూ హక్కుల సాధన, సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం రాజీలేని ప్రజాస్వామ్య పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. దళిత సమాజం ఐక్యంగా నిలిచి తమ హక్కుల కోసం ఉద్యమిస్తేనే న్యాయం సాధ్యమవుతుందని పేర్కొంటూ, ప్రతి దళిత కుటుంబం, ప్రతి కార్యకర్త ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ దళిత సమైఖ్య అధ్యక్షులు కొత్తపల్లి యల్లయ్య, కడప జిల్లా ఉపాధ్యక్షుడు రాములయ్య, కమలాపురం నియోజకవర్గ అధ్యక్షులు నక్కా రమేష్, వీరపునాయునిపల్లె మండల అధ్యక్షులు కాకర్ల మస్తానయ్య, ఉపాధ్యక్షులు కాకల నాగార్జున, రాష్ట్ర అధికార ప్రతినిధి తప్పిట హరిబాబు, రాయలసీమ కోఆర్డినేటర్ మిద్దె వెంకటరమణ, ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షులు చెంచుగార్ల నాగార్జున, ఏపీ దళిత సమైఖ్య మీడియా ప్రతినిధి అశోక్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లాలో చురుగ్గా
## ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమాలు

- నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలి
- జిల్లా ఎయిడ్స్ నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం అధికారి వేంపల్లి భాస్కర్



**అన్నమయ్య బ్యూరో–సూర్య వాస్తవం:** జిల్లాలో ఎయిడ్స నియంత్రణ, నివారణపై అవగాహన కార్యక్రమాలు చురుగ్గా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎయిడ్స నియంత్రణ క్లస్టర్ ప్రోగ్రాం అధికారి వేంపల్లి భాస్కర్ తెలిపారు. గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఎయిడ్స నియంత్రణ మండలి అధికారి డాక్టర్ ఎల్. రాధిక ఆదేశాల మేరకు దిశా ఆధ్వర్యంలో ఐసీటీసీ కౌన్సిలర్లు, ఏఆర్టీ, ఎన్జీవో ప్రతినిధులతో స్థానిక డీహెచ్ఓ కార్యాలయంలో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వేంపల్లి భాస్కర్ మాట్లాడుతూ ఏఆర్టీ, ఐసీటీసీ, ఎన్జీవోలకు నిర్దేశించిన లక్ష్యాలను తప్పనిసరిగా చేరుకోవాలని సూచించారు. లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.గత నెల 12వ తేదీ నుంచి జిల్లాలోని మార్కెట్లు, పాఠశాలలు, కళాశాలలు, అధిక ప్రమాద ప్రాంత గ్రామాల్లో ఎయిడ్సపై అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలు వచ్చే నెల 12వ తేదీ వరకు కొనసాగుతాయని చెప్పారు. రెండు నెలలపాటు హైరిస్క్ గ్రామాలు, కళాశాలలు తదితర ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.మిషన్ ఎయిడ్స సురక్ష (హీూ) కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఎయిడ్స నియంత్రణ కార్యక్రమాలను ప్రతి స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన అన్ని సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా ఎయిడ్స పరీక్షలు, కౌన్సెలింగ్, మందుల సరఫరాలో ఎలాంటి లోపాలు లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రైవేట్ ఆసుపత్రులు కూడా ప్రభుత్వ మార్గదర్శకాలను పాటిస్తూ సేవలు అందించాలని స్పష్టం చేశారు. గర్భిణీల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని, వారికి అవసరమైన వైద్య సేవలను సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో దిశా సిబ్బంది ఆనంద్, సిలార్, కౌన్సిలర్లు జయకుమార్, పుల్లయ్య నాయుడు, చంద్ర మోహన్, ఎన్జీవో ప్రతినిధులు అలావల్లి, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి,అన్నమయ్య జిల్లా

## వేరుశనగ పంటలో
## రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి

- సేంద్రియ ఎరువుల వాడకం పై మొగ్గు చూపాలి
- మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి



**ముద్దనూరు – సూర్య వాస్తవం:** మండలంలోని పెనికలపాడు గ్రామంలో గురువారం గ్యాప్ పొలం బడి కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులతో కలసి సమావేశాన్ని నిర్వహించి, వేరుశనగ పొలం పరిసరాల విశ్లేషణ చేశారు. తదుపరి పొలం లో మిత్ర పురుగుల సంఖ్య తక్కువ ఉందని, శత్రు పురుగుల సంఖ్య ఎక్కువ కనిపిస్తున్నాయని తెలిపారు. రసం పీల్చే పురుగుల ఉధృతి అధికంగా ఉంది అని తెలిపారు. వీటి నివారణకు పసుపు రంగు జిగురు అట్టలను అమర్చుకోవాలి అన్నారు.అలాగే వేరు శనగ పంట పూత దశలో ఉన్నపుడు ఎకరానికి 200 కిలోల జిప్సం చల్లి నీరు పెట్టుకోవాలని జిప్సం చల్లిన తర్వాత తప్పనిసరిగా తేమ ఉండాలని సూచించారు. ఈ విధముగా చేసుకుంటే పూత, పిందె, ఊడలు బాగా ఏర్పడి గట్టి కాయలు అనగా నాణ్యతగా తయారు అయి నూనె శాతం బాగా వస్తుంది అని రైతులకు వివరించారు. పొలం బడి యొక్క సారాంశం ఏమనగా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించి ఎక్కువ ఆదాయం పెంపొందించడమే ప్రధాన ఉదేశ్యం అన్నారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ పద్ధతుల ను అనుసరించి పంటలు సాగు చేయడమే అంతిమ లక్ష్యం అన్నారు. పొలంలో ఇనుప ధాతు లోప లక్షణాలను గుర్తించి తగు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. తిక్క ఆకు మచ్చ తెగులు లక్షణాలను గుర్తించి నివారణ చర్యలు తెలిపారు. విత్తే సమయంలో తప్పనిసరిగా విత్తనశుద్ధి చేసుకుంటే మంచిది అని తెలిపారు. తెగులును తట్టుకునే రకాలను ఎంపిక చేసుకోవాలి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు జి.నాగ మణి, రైతులు బి.ప్రభాకర్ రెడ్డి యన్.ఈశ్వర రెడ్డి, శంకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉద్యమ స్ఫూర్తితో
# అన్నమయ్య జిల్లాలో భోజన విరామ నిరసనలు

**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం:**ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ఉద్యమ కార్యాచరణలో భాగంగా గురువారం అన్నమయ్య జిల్లాలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో భోజన విరామ సమయంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.జిల్లా కలెక్టర్ కార్యాలయం, రెవెన్యూ డివిజనల్ కార్యాలయం పీలేరు, సబ్ కలెక్టర్ కార్యాలయం మదనపల్లి, తహసీల్దార్ కార్యాలయాలు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, రాయచోటి తదితర ప్రభుత్వ కార్యాలయాలలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యమ స్ఫూర్తిని ప్రదర్శించారు.ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ, ఉద్యోగులు మరియు పెన్షనర్లకు ప్రభుత్వం నుండి రావాల్సిన వివిధ ఆర్థిక ప్రయోజనాలు, పెండింగ్ బకాయిలు, పీఆర్సీ, డీఏలు, ఐఆర్ మరియు ఇతర హక్కులకు సంబంధించిన అంశాలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు మరియు వారి కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను ప్రభుత్వం గుర్తించి, వారికి చట్టబద్ధంగా మరియు హక్కుల ప్రకారం రావాల్సిన బకాయిలను వెంటనే మంజూరు చేయాలని కోరారు. ఉద్యోగుల సమస్యల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరిని విడనాడి, ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో చర్చలు జరిపి



సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా "చేయి చేయి కలుపుదాం -- హ్యాండ్ టూ హ్యాండ్" కార్యక్రమాన్ని కూడా జిల్లాలో విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా మరియు డివిజన్ స్థాయి కార్యాలయాలను సందర్శిస్తూ ఉద్యోగులకు కరపత్రాలు పంపిణీ చేసి, ఉద్యమం చేపట్టడానికి గల కారణాలను వివరిస్తూ ఉద్యోగులను ఐక్య ఉద్యమానికి సంసిద్ధులను చేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగులందరూ తన మన బేధాలు లేకుండా ఐక్యంగా ఉద్యమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ మరియు పెన్షనర్ సంఘాలను కూడా ఐక్య ఉద్యమంలో భాగస్వాములు కావాలని ఆహ్వానించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమాలలో అన్నమయ్య జిల్లా ఏపీ జేఏసీ చైర్మన్ శ్రీ పి. నరసింహ కుమార్, ఏపీ జేఏసీ జిల్లా సెక్రటరీ శ్రీ గోపి, ఏపీఆర్ఎస్ఏ జిల్లా సెక్రటరీ శ్రీ బాబ్జి, కలెక్టర్ కార్యాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షురాలు శ్రీమతి శ్రావణి, కలెక్టర్ కార్యాలయ ఉద్యోగుల సంఘం సెక్రటరీ శ్రీ వంశీ, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ రామలింగారెడ్డి, మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, జీఎస్‌డబ్ల్యూఎస్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు మరియు ఇతర అనుబంధ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి ఉద్యోగి ఐక్యంగా నిలబడాల్సిన సమయం ఆసన్నమైందని, ఉద్యమ కార్యాచరణలో భాగంగా ప్రతి కార్యాలయంలో ఉద్యోగులనుకలిసి సమస్యలపై అవగాహన కల్పిస్తూ ఉద్యమానికి సంసిద్ధులను చేయనున్నట్లు తెలిపారు."మన హక్కుల కోసం మనమే పోరాడాలి... ఐక్యతే మన బలం... ఉద్యమమే మన ఆయుధం" అంటూ ఉద్యోగులు నినాదాలు చేస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.



## ఉద్యోగుల సమస్యలపై
## ప్రభుత్వం వెంటనే చర్చలకు ఆహ్వానించాలి

**- జెఏసి చైర్మెన్ రామసుబ్బయ్య యాదవ్**

**ప్రొద్దుటూరు– సూర్య వాస్తవం:** ఏపీ ఎన్ జి జి వోస్ అసోసియేషన్, ప్రొద్దుటూరు తాలూకా కార్యవర్గం మరియు జెఏసి సమావేశం గురువారం సాయంత్రం నిర్వహించారు.కార్యాచరణకు దిశానిర్దేశం పీఆర్సీ, పెండింగ్ డీఏలు, ఇతర డిమాండ్లపై ప్రధానంగా చర్చించారు.చర్చల ద్వారానే సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లపై రాజీలేని వైఖరి తో కలిసి ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడాలని లేనిపక్షంలో ఏపీ జేఏసీ చైర్మన్ ఎ. విద్యాసాగర్, సెక్రటరీ జనరల్ కే ఎస్ ఎస్ ప్రసాద్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి రమణ కడప జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు పిలుపు మేరకు ఎప్పుడు ఏ కార్యచరణ కు ఆదేశించిన సిద్ధంగా ఉండాలని తీర్మానించారు. కూటమి ప్రభుతము ఏర్పడిన తరువాత ఉద్యోగులు యొక్క పెండింగ్ బకాయిలు, మరియు మెమో 57 అమలు చేయడం వంటి సానుకూల నిర్ణయాలు తీసుకున్నప్పటికీ ఉద్యోగుల యొక్క పిఆర్సి మరియు ఐ ఆర్ మరియు డిఏ లు సరెండరు లీవు లు పెండింగ్ వంటి సమస్యలు పేరుకుపోయి ఉన్నందున ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాల ప్రతినిధులను ఆహ్వానించి, పెండింగ్ సమస్యలపై సానుకూల నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో చర్చలు, సంప్రదింపుల ద్వారానే సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని రాష్ట్ర అధ్యక్షులు జే ఏ సీ చైర్మన్ అలపర్తి విద్యాసాగర్ నాయకత్వములో బాధ్యతాయుతమైన ప్రధాన వ్యవస్థగా సంఘంగా ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తదుపరి రాష్ట్ర నాయకత్వం నిర్ణయం మేరకు సిద్ధంగా ఉండాలని తాలూకా అధ్యక్షులు, జెఏసి చైర్మెన్ జె.రామసుబ్బయ్య యాదవ్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ ప్రమీల, అసోసియేట్ ప్రెసిడెంట్ అశోక్ కుమార్, కోశాధికారి సదాశివయ్య, వైస్ ప్రెసిడెంట్ నాగార్జున, వరప్రసాద్, జాయింట్ సెక్రెటరీస్ మధుసూధనరెడ్డి, సుజాత, జెఏసి కో చైర్మెన్స్ సలీం, గోపాల్ , వేణు గోపాల్ రెడ్డి, రమణ రెడ్డి, ఓంకార్, పీరయ్య, నరసింహ, మహేశ్వరయ్య, మహిళా విభాగ సభ్యులు అరుణా దేవి, గంగాదేవి తదితరులు పాల్గొన్నారు.




PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR -Mohammad Shafi Ahamad 9948461699 )

# ఘనంగా ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు



**పామిడి రూరల్-సూర్య వాస్తవం:** పామిడి మండలంలోని జి.కోటాల గ్రామంలో గల అంగన్‌వాడీ కేంద్రంలో శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు ఘనంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పూలు, బెలూన్లతో అందంగా అలంకరించారు. చిన్నారులతో పాటు పాల్గొన్న వారికి స్వీట్లు పంచిపెట్టారు. ఈకార్యక్రమంలో గ్రామ సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామ ప్రజలందరికీ శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు.





**శ్రీ చైతన్య పాఠశాల ఆవరణలో ....** శ్రీకృష్ణాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో ముందస్తుగా నిర్వహించారు. చిన్నారులు చిన్ని చిన్ని కృష్ణుడు రాధా, గోపికల వేషధారణలతో అలరించగా, ఉట్టి కొట్టే కార్యక్రమం విశేషంగా ఆకట్టుకుంది. ఈ సందర్భంగా సీఈఓ సంతోష్ రెడ్డి మాట్లాడుతూ శ్రీకృష్ణాష్టమి కేవలం ఒక పండుగ మాత్రమే కాదు, అది మన సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక. శ్రీకృష్ణుని జీవితం ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం. చిరునవ్వుతో ఎదురయ్యే ఎలాంటి కష్టాలనైనా జయించవచ్చని ఆయన జీవితం మనకు నేర్పుతుంది. విద్యార్థులు చిన్నతనం నుంచే శ్రీకృష్ణుని లీలలు, ఆయన చూపిన ధర్మమార్గాన్ని అలవర్చుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలి అని పిలుపునిచ్చారు. పాఠశాల డైరెక్టర్ రమణారెడ్డి భగవద్గీత విశిష్టతను వివరిస్తూ మానవాళికి శ్రీకృష్ణ పరమాత్మ అందించిన అద్భుత కానుక భగవద్గీత. ఏ పని చేసినా ప్రతిఫలాన్ని ఆశించకుండా కర్మను నిష్కామంగా చేయాలన్నదే గీత యొక్క ప్రధాన ఉద్దేశం. విద్యార్థులు తమ కర్తవ్యమైన చదువుపై శ్రద్ధ వహించి, క్రమశిక్షణ, నైతిక విలువలతో ముందుకు సాగితే జీవితంలో గొప్ప శిఖరాలను చేరుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థినీ,విద్యార్థుల నృత్య ప్రదర్శన కృష్ణ లీలలు డ్రామా ఎంతగానో చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను దిగ్విజయం చేశారు.



**మండల కేంద్రమైన బెళుగుప్పలోని సన్‌రైజర్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ....** గురువారం ముందస్తు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ మారెన్న ఆధ్వర్యంలో మామిడి తోరణాలు, అరటి పిలకలు, వివిధ రకాల పూలతో పాఠశాలను అందంగా అలంకరించి పచ్చటి పండుగ వాతావరణాన్ని నెల కొల్పారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా ఎంఈఓ-1 గోవిందరాజులు, ఎంఈఓ-2 హరికృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మారెన్న, ఎంఈఓలు గోవిందరాజులు, హరికృష్ణలు శ్రీకృష్ణ భగవానుడి చిత్రపటానికి పూలమా లలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యతో పాటు సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రత్యేకతలను విద్యార్థులకు తెలియజేస్తున్న సన్‌రైజర్స్ పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. శ్రీకృష్ణుడి జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు భగవంతుని నామస్మరణతో పాటు విద్యపై ఏకాగ్రత పెంచుకుని క్రమశిక్షణతో ముందుకు సాగితే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని సూచించారు. జన్మాష్టమి వేడుకల్లో భాగంగా పలువురు చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో ముస్తాబై అందరినీ ఆకట్టుకున్నారు. కృష్ణుడి పాటలకు చిన్నారులు చేసిన నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులు, తల్లిదండ్రులను అలరించాయి. అనంతరం నిర్వహించిన ఉట్టి కొట్టే కార్యక్రమం ఉల్లాసంగా, ఉత్సాహంగా సాగింది. విద్యా ర్థులు ఎంతో ఆనందంగా పాల్గొని వేడుకలను మరింత సందడిగా మార్చారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ-1 గోవిందరాజు లు, ఎంఈఓ-2 హరికృష్ణ, కరస్పాండెంట్ మారెన్న, పాఠశాల డైరెక్టర్లు నాగభూషణం, తిప్పేస్వామి, ఉపాధ్యాయ బృందం భారతి, మమత, నాగవేణి, శిరీష, మాలశ్రీ, అంజలి, దివ్య, దీప, ఎర్రిస్వామి, శివ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



**అనంతపురం పాఠశాలలో ....** శ్రీకృష్ణాష్టమి వేడుకలను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలో ముస్తాబై సందడి చేశారు. చిన్నారుల నృత్యాలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు శ్రీకృష్ణుడి జన్మ విశిష్టత, శ్రీకృష్ణాష్టమి పండుగ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి, చిన్నారుల్లో ఆధ్యాత్మిక భావనతో పాటు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేసి వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు, నృత్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో పాఠశాల ప్రాంగణం సందడిగా మారింది.



**పెద్దవడుగూరు స్థానిక ఆదర్శ విద్యా నికేతన్ పాఠశాలలో**



**...**శ్రీకృష్ణాష్టమి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం ఎంతో ఉత్సాహంగా, భక్తిభావంతో జరుపుకున్నారు. అధర్మాన్ని అణచి, ధర్మాన్ని నిలబెట్టేందుకు అవతరించిన శ్రీకృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని పాఠశాల ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులు, తోరణాలతో సుందరంగా అలం కరించారు. ఈ వేడుకల్లో భాగంగా పాఠశాలలోని చిన్నారి విద్యార్థులంతా శ్రీకృష్ణుడు, రాధల వేషధారణలతో హాజరయ్యారు. నెమలి పించాలు, చేతిలో పిల్లనగ్రోవులతో చిరునవ్వులు చిందిస్తూ చిన్నారి కృష్ణులు చేసిన సందడి అంతా ఇంతా కాదు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, కృష్ణ లీలల నాటికలు, గోపికల నృత్యాలు వీక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి .వేడుకల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచింది ఉట్టి కొట్టే (దహీ హండీ) కార్యక్రమం. ఉపాధ్యాయులు పాఠశాల మైదానంలో ఎత్తుగా కట్టిన ఉట్టిని బద్దలు కొట్టేందుకు విద్యార్థులు పోటీ పడ్డారు. "గోవిందా.. గోపాలా.." అంటూ విద్యార్థులు చేసిన జయజయధ్వానాల మధ్య ఒక విద్యార్థి ఉట్టిని కొట్టడంతో మైదానమంతా చప్పట్లతో మారుమోగిపోయింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరణం నారాయణ రావు మాట్లాడుతూ.. మన సంస్కృతి, సాంప్రదాయాలను పిల్లలకు చిన్నతనం నుంచే అలవాటు చేయాలనే ఉద్దేశంతో ఈ వేడుకలను నిర్వహించినట్లు తెలిపారు. శ్రీకృష్ణుడు భగవద్గీత ద్వారా అందించిన కర్తవ్య బోధనను, నీతిని విద్యార్థులు తమ జీవితంలో అన్వయి ంచుకుని ఉత్తమ పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. అనంతరం వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులకు కృష్ణుడికి ఎంతో ప్రీతికరమైన అటుకులు, వెన్న, పాయసాన్ని ప్రసాదంగా విద్యార్థులకు పంపిణీ చేయడంతో వేడుకలు ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆల్ ద బెస్ట్ శ్రీనివాస్ రెడ్డి...!!

**- ప్రజా సమస్యలను వెలికి తీసుకురండి- సిఎస్ఆర్ 2.0 యూట్యూబ్ ఛానల్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్**






**శ్రీ సత్య సాయి బ్యూరో - సూర్య వాస్తవం:** సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు .

సీనియర్ జర్నలిస్ట్ చెరువు శ్రీనివాస్ రెడ్డి గురువారం పట్టణంలోని దత్త ఫంక్షన్ హాల్ కాంప్లెక్స్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన సి ఎస్ ఆర్ 2.0 యూట్యూబ్ ఛానల్ ను ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు ఆల్ ద బెస్ట్ శ్రీనివాస్ రెడ్డి మీరు సి ఎస్ ఆర్ అనే పేరు మీద పెట్టిన పేరుకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని మీరు అభివృద్ధి బాటలో పయనించాలని ఆల్ ద బెస్ట్ అంటూ అభినందించారు. కార్యాలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పూజా కార్యక్రమం అనంతరం ఛానల్ లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ... సమాజంలో జర్నలిజం అనేది ప్రజా సమస్యల పట్ల కీలకంగా వ్యవహరిస్తూ ఎప్పటికప్పుడు వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకోవడమే ప్రధాన కర్తవ్యం అన్నారు. ప్రజలకు వాస్తవ సమాచారాన్ని చేరవేయడంలో మీడియా పాత్ర అత్యంత కీలకమని అన్నారు. జర్నలిజం రంగంలో తనకున్న అనుభవంతో శ్రీనివాస్ రెడ్డి ప్రారంభించిన సీఎస్సార్ 2.0 మీడియా ఛానల్ ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, ప్రజల గొంతుకగా నిలవాలని ఆకాంక్షించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో యూట్యూబ్ వంటి సామాజిక మాధ్యమాలు ప్రజలకు సమాచారాన్ని వేగంగా చేరవేయడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. నిష్పక్షపాతంగా, వాస్తవాలను ప్రజలకు అందిస్తూ మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు. అనంతరం యూట్యూబ్ ఛానల్ యాజమాన్యానికి, సీనియర్ జర్నలిస్ట్ శ్రీనివాస్ రెడ్డి కి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఛానల్ విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సిఎస్ఆర్ 2.0 యూట్యూబ్ ఛానల్ ప్రారంభోత్సవానికి వివిధ పార్టీల రాజకీయ నాయకులతో పాటు మీడియా మిత్రులు బంధువులు హాజరయ్యారు.

## మాదక ద్రవ్యాల నివారణ,

# పోక్సో చట్టం,రోడ్డు భద్రతపై అవగాహన

- గుడ్ టచ్--బ్యాడ్ టచ్,పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన.
- మహిళలు, బాలికల భద్రతపై ప్రత్యేక సూచనలు.
- సోషల్ మీడియా దుర్వినియోగం,రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన.
- అత్యవసర పరిస్థితుల్లో 112కు సమాచారం ఇవ్వాలని సూచన.



**దొరవారిసత్రం -సూర్య వాస్తవం:**

తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు, ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు అధికారులు విద్యార్థులు, యువత, మహిళల భద్రతకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.దేక్కిలి మండలం ఆల్తూరుపాడు గ్రామం, శ్రీకాళహస్తి రెండో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎం.ఎం.వాడ, వడమాలపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలాయపల్లి మరియు ఓబులవారిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని విద్యా సంస్థలు,బాలికల హాస్టళ్లలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమాల్లో గుడ్ టచ్--బ్యాడ్ టచ్,పోక్సో చట్టం,మహిళలపై వేధింపుల నివారణ,గంజాయి మరియు ఇతర మాదక ద్రవ్యాల దుష్ప్రభావాలు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు,రోడ్డు ప్రమాదాల నివారణ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాలికల భద్రతకు సంబంధించి అపరిచిత వ్యక్తులు అందించే ఆహార పదార్థాలను స్వీకరించకూడదని, అపరిచితుల వాహనాల్లో లిఫ్ట్ తీసుకోకూడదని సూచించారు.వినాయక చవితి నిమజ్జనం సందర్భంగా చెరువులు,బావులు,నీటి కుంటల వద్దకు వెళ్లకుండా తల్లిదండ్రులు,ఉపాధ్యాయుల సూచనలు పాటించాలని విద్యార్థులకు తెలియజేశారు.

జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు,మాట్లాడుతూ, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని,తమ భద్రత విషయంలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే 112కు సమాచారం అందించాలని తెలిపారు.ప్రజల్లో,ముఖ్యంగా విద్యార్థులు మరియు యువతలో భద్రతా అవగాహన పెంపొందించి నేరాల నివారణకు జిల్లా వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని జిల్లా పోలీస్ శాఖ వెల్లడించింది.



# వినాయక విగ్రహాల నిమజ్జనానికి మార్గం సుగమం...!

**మోడల్ కాలనీలో అడ్డుగా ఉన్న చెట్టుకొమ్మల తొలగింపు**
**వినాయక ఉత్సవాలకు సహకరిస్తున్న ఎమ్మెల్యే, మున్సిపల్ అధికారులకు కృతజ్ఞతలు**

**హిందూపురం - సూర్య వాస్తవం :** పుర ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా నిమజ్జన కార్యక్రమానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ ఆధ్వర్యంలో గుడ్డం రంగనాథస్వామి కోనేరు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.నిమజ్జన రోజున వినాయక విగ్రహాలు పురవీధుల మీదుగా ఊరేగింపుగా తరలించే క్రమంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా మోడల్ కాలనీలో విగ్రహాల తరలింపునకు అడ్డుగా ఉన్న చెట్టుకొమ్మలను తొలగించారు.ఈ కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర నాయకులు, హిందూపురం వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు రమేష్‌రెడ్డి దగ్గరుండి పర్యవేక్షించారు. మోడల్ కాలనీ వినాయక ఉత్సవ నిర్వాహకులతో మాట్లాడి విగ్రహాలు సురక్షితంగా తరలించే మార్గంలో అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించేలా చర్యలు చేపట్టారు.వినాయక చవితి ఉత్సవాలకు అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు సహకరిస్తున్న ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, మున్సిపల్ సిబ్బంది, కార్మికులకు హిందూపురం ప్రజల తరఫున రమేష్‌రెడ్డి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి రవితేజరెడ్డి, డాలేశ్వర్, శివప్ప, రంగనాథ్, అశ్విన్, తరుణ్, శివ, బాలు, మంజు, చంద్ర, గంగాధర్, అభి, జస్వంత్, గణేష్‌తో పాటు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.